E KABURU - Digital News Paper E-PAPER

# ఈ-కబురు

@ekaburu.com

ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం

హైదరాబాద్ (తేదీ) 15-03-2026 (వారం) ఆదివారం సంపుటి: 02 || సంచిక:72 || పేజీలు–6 www.ekaburu.com



## చరిత్ర సృష్టించిన తెలంగాణ విద్యుత్ శాఖ

- విద్యుత్ వినియోగంలో ఆల్ టైమ్ రికార్డ్
- ఈ నెల 13న ఒక్క రోజే 341 మిలియన్ యూనిట్ల సరఫరా
- భవిష్యత్ అవసరాలకు సిద్ధంగా ఉన్నాం

....(మిగతా2లో)

## తృణమూల్ ప్రభుత్వానికి కౌంట్‌డౌన్

- బెంగాల్‌లో జంగిల్ రాజ్ అంతం కాక తప్పదు
- రాబోయే అసెంబ్లీ ఎన్నికలు ఒక నిర్ణయాత్మక పోరాటం
- కోల్‌కతా బహిరంగ సభలో ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టీకరణ
- చొరబాటుదార్ల ఓట్లను తొలగిస్తే తప్పేమిటని ప్రశ్న



....(మిగతా2లో)



## భాగ్యనగరం చుట్టూ రింగ్ రైలు

### .. సర్వేకు మోదీ సర్కార్ గ్రీన్ సిగ్నల్


సరుకు రవాణా సులభతరం
రింగ్ రోడ్డు.. రింగ్ రైలు సమన్వయంతో సాగితే ఆయా ప్రాంతాల్లో నూతన పారిశ్రామిక హబ్‌లు వెలిసే అవకాశం ఉంది

**ఈ-కబురు, ; భాగ్యనగర వాసుల చిరకాల స్వప్నమైన రీజినల్ రింగ్ రైల్ ప్రాజెక్టు దిశగా కీలక అడుగు పడింది. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టు డీపీఆర్ (డిటెయిల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్) తయారీకి అవసరమైన సర్వే నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి అడిగిన ప్రశ్నలకు సమాధానంగా కేంద్ర రైల్వే శాఖ సహాయ మంత్రి రవనీత్ సింగ్ ఈ మేరకు లేఖ రాశారు.**

తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదించిన మార్పులకు అనుగుణంగా ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లేందుకు కేంద్రం సానుకూలత వ్యక్తం చేయడం గమనార్హం.గతంలో రూపొందించిన రీజినల్ రింగ్ రైలు మార్గం రీజినల్ రింగ్ రోడ్డుకు సుమారు 10 నుండి 11 కిలోమీటర్ల దూరంలో ఉండేది. రెండు మార్గాలు వేర్వేరుగా ఉండటం వల్ల భూసేకరణ భారంగా మారుతుందని.. పరిపాలనాపరమైన ఇబ్బందులు తలెత్తుతాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భావించారు. ఈ క్రమంలోనే రింగ్ రోడ్డుకు సమాంతరంగానే రింగ్ రైలు మార్గం ఉండేలా చూడాలని ఆయన కేంద్రాన్ని కోరారు. రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకున్న కేంద్రం.. ప్రస్తుతం రింగ్ రోడ్డు వెంటే రైల్వే అలైన్‌మెంట్‌ను ఖరారు చేసే అంశంపై తెలంగాణ అధికారులతో సంప్రదింపులు జరుపుతోంది.ఈ ప్రాజెక్టు అమలుకు సంబంధించి కచ్చితమైన కాల పరిమితిని ఇప్పుడే చెప్పలేమని కేంద్ర మంత్రి స్పష్టం చేశారు. అయితే డీపీఆర్ సిద్ధం చేసేందుకు అవసరమైన ప్రాథమిక సర్వేకు అనుమతులు మంజూరు చేయడం ద్వారా ఈ ప్రక్రియలో వేగం పెరిగింది. సర్వే పూర్తయి పూర్తిస్థాయి నివేదిక సిద్ధమైన తర్వాత దానిని రాష్ట్ర ప్రభుత్వం.. నీతి ఆయోగ్.. కేంద్ర ఆర్థిక శాఖల ఆమోదానికి పంపిస్తారు.

....(మిగతా2లో)

## మూసీని మురికి కూపంగా మార్చింది కాంగ్రెస్ పార్టీనే: కేటీఆర్



- వేలమంది ఇళ్లు కూల్చి వాటి పునాదులపై మూసీ ప్రణాళిక అంటే ఒప్పుకోం
- మేము ఒక్క ఇంటినీ కూల్చకుండా 6 కి.మీ. అభివృద్ధి చేశాం
- మూసీకి వ్యతిరేకం కాదు.. జరిగే అవినీతి, ఇళ్ల కూల్చివేతను అడ్డుకుంటాం
- 'మూసీ–పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ వర్సెస్ పబ్లిక్ పాయింట్'లో కేటీఆర్
- మూసీ సుందరీకరణ ప్రాజెక్టు పేరుతో రూ.లక్షన్నర కోట్ల భూములపై రేవంత్‌రెడ్డి కన్ను: కేటీఆర్

ఈకబురు, హైదరాబాద్/బండ్లగూడ: గత బీఆర్ఎస్ ప్రభుత్వం కేవలం రూ.16వేల కోట్లతో ఒక్క ఇల్లూ కూల్చకుండా మూసీని అభివృద్ధి చేసే ప్రణాళికలు సిద్ధం చేసిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చెప్పారు. ఇప్పటికే ఉప్పల్, నాగోల్ ప్రాంతాల్లో 6 కి.మీ. మేర విజయవంతంగా అభివృద్ధి చేశామన్నారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రూ.లక్షన్నర కోట్ల అంచనాలతో సామాన్యుల ఇళ్లను కూల్చివేస్తూ విధ్వంసానికి పాల్పడుతోందని ధ్వజమెత్తారు. శనివారం హిమాయత్ సాగర్ వేదికగా 'మూసీ పునరుజ్జీవం- పవర్ పాయింట్ ప్రజెంటేషన్ వర్సెస్ పబ్లిక్ పాయింట్ 'కార్యక్రమాన్ని కేటీఆర్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎలాంటి ప్లానింగ్ రిపోర్టు లేకుండా సోషల్ ఇంపాక్ట్ స్టడీ, ఎన్విరాన్‌మెంటల్ ఇంపాక్ట్ స్టడీ వంటి నివేదికలు లేకుండా, ప్రజలతో చర్చలు నిర్వహించకుండా వేలాదిమంది ఇళ్లను కూలగొడతామని కాంగ్రెస్ ప్రభుత్వం భయాందోళనకు గురిచేస్తోందని మండిపడ్డారు. 'అభివృద్ధికి మేము ఏమాత్రం వ్యతిరేకం కాదు. అవినీతికి, కాంగ్రెస్ భూదాహానికి, రేవంత్ రెడ్డి లక్షల కోట్ల అవినీతి ప్రణాళికలకు మాత్రం వ్యతిరేకం. రేవంత్ రెడ్డి అవినీతిని అడ్డుకుంటాం. పార్టీలకు అతీతంగా హైదరాబాద్ నగర ప్రజలను కాపాడుకుంటాం. బాధితుల వెంట బీఆర్ఎస్ ఉంటుంది'అని కేటీఆర్ చెప్పారు. రెండేళ్లపాటు మూసీ బాధితులు సమష్టిగా ప్రభుత్వంపై పోరాడితే, తమ ప్రభుత్వం వచ్చాక కాంగ్రెస్ బుల్డోజర్ రాజ్యాన్ని పారదోలి అందరి ఇళ్లు, భూములను కాపాడతామని హామీ ఇచ్చారు.

ప్రభుత్వం వద్ద డబ్బుల్లేవన్నారు..

ఇచ్చిన హామీలకు, అభివృద్ధికి ప్రభుత్వం వద్ద డబ్బులు లేవని, విపరీతంగా అప్పులు ఉన్నాయని చెబుతున్న రేవంత్ రెడ్డి.. మూసీ కోసం వేల కోట్లు ఖర్చు పెడతానంటున్నాడని కేటీఆర్ ఎద్దేవాచేశారు.

....(మిగతా2లో)



2

## పుతిన్ ప్రతిపాదనను తిరస్కరించిన ట్రంప్

ఈ-కబురు, : పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు నెలకొన్న వేళ.. అమెరికా, రష్యా అధ్యక్షులు ఇటీవల ఫోన్‌లో సంభాషించుకొన్నారు. యుద్ధాన్ని ముగించడంలో భాగంగా.. ఇరాన్ శుద్ధి చేసిన యురేనియం నిల్వలను రష్యాకు తరలించాలని పుతిన్ ప్రతిపాదించినట్లు తెలిసింది. అయితే, దీనిని ట్రంప్ తిరస్కరించినట్లు సమాచారం.



3

## తమిళ రచయిత వైరముత్తుకు... జ్ఞానపీఠ్

ఈ-కబురు, దిల్లీ; చెన్నై: తమిళ రచయిత, సాహిత్యకారుడు ఆర్.వైరముత్తును 60వ జ్ఞానపీఠ్ పురస్కారం వరించింది. ప్రొఫెసర్ ప్రతిభా రే నేతృత్వంలో శనివారం దిల్లీలో సమావేశమైన 'భారతీయ జ్ఞానపీఠ్ పాలక మండలి' సభ్యులు.. 2025కు సంబంధించిన పురస్కారానికి వైరముత్తును ఎంపిక చేస్తూ ఏకగ్రీవంగా నిర్ణయం తీసుకున్నారు.

## ప్రజల కోసమే.. ఆశీర్వాద యాత్ర

సమాజానికి మంచి చేయాలని, తమను గెలిపించిన ప్రజల అభ్యున్నతి కోసం పాటుపడాలని కోరుతూ అంజన్న ఆలయానికి పాదయాత్రగా వెళ్తున్నామని కేంద్ర హోం శాఖ సాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ అన్నారు. శనివారం ఉదయం కరీంనగర్‌లోని మహాశక్తి ఆలయం వద్ద అంజన్న ఆశీర్వాద యాత్రను ప్రారంభించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారుజ




....(మిగతా2లో)



## వేసవిలోగా వసతిగృహాల మరమ్మతులు పూర్తవ్వాలి

ఈకబురు, హైదరాబాద్: నిర్మాణ పనులు 80% పూర్తయిన సంక్షేమ వసతిగృహాలను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని, పాత భవనాల మరమ్మతుల బిల్లులు ప్రతి 15 రోజులకొకసారి చెల్లిస్తామని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పేర్కొన్నారు.

....(3లో)



3

## పెళ్లికి నిరాకరించిందని ఓ యువతికి ఎయిడ్స్ రక్తాన్ని ఇంజెక్షన్ ద్వారా ఎక్కించిన యువకుడు

హైదరాబాద్ మార్చ్ 14 (ఈ-కబురు, )
హైదరాబాద్ శివారులోని పోచారంలో అమానుష ఘటన చోటుచేసుకుంది. తనతో పెళ్లికి నిరాకరించిందని ఓ యువతికి ఎయిడ్స్ రక్తాన్ని ఇంజెక్షన్ ద్వారా ఎక్కించాడు.

# ఎడతెగని దాడులు

- ఇరాన్‌పై విరుచుకుపడ్డ అమెరికా, ఇజ్రాయెల్ యుద్ధవిమానాలు
- గల్ఫ్ దేశాలపైకి దూసుకెళ్లిన టెహ్రాన్ క్షిపణులు, డ్రోన్లు
- ఒమన్‌లో డ్రోన్ దాడి.. ఇద్దరు భారతీయుల మృతి
- మరో 10 మందికి గాయాలు
- ఇరాక్‌లో కూలిన అమెరికా రీఫ్యూయెలింగ్ విమానం
- ఆరుగురు సిబ్బంది మృత్యువాత
- ఇరాన్ త్వరలోనే లొంగిపోతుందన్న ట్రంప్

ఈకబురు,: పశ్చిమాసియాలో పరిస్థితులు ఎంతమాత్రమూ కుదుటపడట్లేదు. అమెరికా ఇజ్రాయెల్ దాడులు.. ఇరాన్ ప్రతీకార దాడులతో ఆ ప్రాంతమంతా దద్దరిల్లుతూనే ఉంది. టెహ్రాన్ సైనిక సామర్థ్యాలను దెబ్బకొట్టడమే లక్ష్యంగా వాషింగ్టన్, టెల్ అవీవ్ యుద్ధవిమానాలతో దాడులు కొనసాగించాయి. ఇరాన్ కూడా ఇజ్రాయెల్‌పై, గల్ఫ్ దేశాలపై క్షిపణులు, డ్రోన్లతో విరుచుకుపడింది. ఒమన్‌పై టెహ్రాన్ జరిపిన డ్రోన్ దాడిలో ఇద్దరు భారతీయులు ప్రాణాలు కోల్పోయారు. మరో 10 మంది గాయపడ్డారు. పశ్చిమ ఇరాక్‌లో అమెరికా రీఫ్యూయెలింగ్ విమానమొకటి కూలిపోవడంతో.. అందులోని ఆరుగురు అమెరికా సిబ్బంది మృత్యువాతపడ్డారు. మరోవైపు ఇరాన్ త్వరలోనే లొంగిపోతుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ జోస్యం చెప్పారు. అమెరికా విమానవాహక నౌక అబ్రహం లింకన్‌పై తాము బాలిస్టిక్ క్షిపణులతో దాడి చేశామని, ప్రస్తుతం అది పనిచేయడం లేదని ఇరాన్ పేర్కొంది. ఆ ప్రకటనను వాషింగ్టన్ తోసిపుచ్చింది. ఇరాన్‌వ్యాప్తంగా సైనిక, ఇతర లక్ష్యాలపై అమెరికా, ఇజ్రాయెల్ శుక్రవారం యుద్ధవిమానాలతో బాంబుల వర్షం కురిపించాయి. యుద్ధం మొదలైనప్పటి నుంచి ఇరాన్‌లో 15 వేల లక్ష్యాలపై తాము దాడి చేసినట్లు వాషింగ్టన్ తెలిపింది.

....(మిగతా3లో)





కళాశాల బస్సును ఢీకొట్టిన గూడ్సు రైలు..

## 23 మందికి తీవ్రగాయాలు

ఈకబురు,చెన్నై: రైల్వే లెవల్ క్రాసింగ్‌ను దాటేందుకు ప్రయత్నించిన కళాశాల బస్సును గూడ్సు రైలు ఢీకొట్టింది. తమిళనాడులోని కరూర్ జిల్లాలో జరిగిన ఈ ఘటనలో 23 మంది విద్యార్థులు తీవ్రంగా గాయపడ్డారు. తాంతోణి సమీపాన ఉన్న ఓ ప్రైవేటు కళాశాలకు చెందిన బస్సు విద్యార్థులతో బయలుదేరింది.

....(2లో)

## తెలంగాణను ఆయిల్ పామ్ హబ్‌గా తీర్చిదిద్దుతాం : మంత్రి తుమ్మల

- నర్మేట్టలో రూ.300 కోట్లతో అత్యాధునిక పామాయిల్ ఫ్యాక్టరీ నిర్మాణం
- కేవలం 18 నెలలలోనే ఫ్యాక్టరీ పనులు పూర్తి చేశాము - మంత్రి తుమ్మల
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా త్వరలో ప్రారంభం కానున్న నర్మేట్ట ఫ్యాక్టరీ

....(మిగతా3లో)



## అరణ్యమే వేదిక... గిరిజనమే అతిథులు

ఈ-కబురు, పాడేరు :

అడవి నాకు అమ్మలాంటిది... అరణ్యాన్ని నమ్ముకొని బతికే గిరి బిడ్డలు నా తోబుట్టువులు అని చెప్పే ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆ మాట ఆచరణలో చూపించారు. జనసేన పార్టీ 13వ ఆవిర్భావ దినోత్సవాన్ని పచ్చటి అడవి మధ్యలో, గిరిపుత్రులే ముఖ్య అతిథులుగా నిర్వహించారు.

....(మిగతా2లో)



## డొమెస్టిక్ సిలిండర్ల కోసం ఆందోళన అవసరం లేదు: మంత్రి ఉత్తమ్

ఈ-కబురు, హైదరాబాద్:
ఎల్‌పీజీ సిలిండర్ల పంపిణీలో వినియోగదారులకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపడుతున్నామని తెలంగాణ పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి తెలిపారు. డొమెస్టిక్ సిలిండర్ల పంపిణీలో ఎలాంటి ఇబ్బందీ లేదన్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి కమిటీ, జిల్లా స్థాయిలో కలెక్టర్ల ఆధ్వర్యంలో కమిటీలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు.



....(మిగతా2లో)

### ప్రజల కోసమే..
# ఆశీర్వాద యాత్ర

ఈకబురు,: కరీంనగర్ : సమాజానికి మంచి చేయాలని, తమను గెలిపించిన ప్రజల అభ్యున్నతి కోసం పాటుపడాలని కోరుతూ అంజన్న ఆలయానికి పాదయాత్రగా వెళ్తున్నామని కేంద్ర హోం శాఖ సాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ అన్నారు. శనివారం ఉదయం కరీంనగర్‌లోని మహాశక్తి ఆలయం వద్ద అంజన్న ఆశీర్వాద యాత్రను ప్రారంభించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారుజ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో పంచాయతీ మున్సిపల్ ఎన్నికల్లో గెలిచిన బీజేపీ ప్రజా ప్రతినిధులతో కలిసి కొండగట్టు అంజన్న ఆలయం వద్దకు వస్తానని ఎన్నికల ప్రచార సభల్లో ప్రకటించామన్నారు. దానికనుగుణంగా పార్లమెంట్ పరిధిలోని వార్డు సభ్యులు, సర్పంచులు, కౌన్సిలర్లు, మేయర్, డిప్యూటీ మేయర్, కార్పొరేటర్లు, వార్డు సభ్యులతో కలిసి మహాపాదయాత్ర చేపడుతున్నామన్నారు. నిత్యం కొలిచే మహాశక్తి అమ్మవారి ఆలయం నుంచే కొండగట్టుకు ఆధ్యాత్మిక యాత్రను ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. పదో తరగతి విద్యార్థులు ఆందోళనకు గురి కావద్దని, కష్టపడి చదివారని, ఇష్టపడి రాయాలన్నారు. పదో తరగతి పరీక్షలు ఉన్నందున విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా పాదయాత్ర చేపట్టాలని నాయకులకు, కార్యకర్తలకు సూచించారు. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ తలపెట్టిన అంజన్న ఆశీర్వాద యాత్రలో కాషాయ దళం కదం తొక్కింది. కరీంనగర్‌లోని మహాశక్తి ఆలయం వద్ద ప్రారంభమైన మహాపాదయాత్రలో పెద్ద ఎత్తున బీజేపీ నాయకులు కార్యకర్తలు పాల్గొని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్‌తో కలిసి ముందుకు సాగారు. డప్పు చప్పుళ్లు, భక్తి పాటలు, నృత్యాలు, కాషాయ జెండాలతో జై శ్రీరాం నినాదాలు చేస్తు తరలి వెళ్లారు. దారిపొడవునా పాదయాత్రకు నాయకులు, కార్యకర్తలు స్వాగతం పలికారు. ఎస్సారార్ కళాశాల, ఆర్టీసీ వర్క్‌షాపు, రేకుర్తితో పాటు, కొత్తపల్లి పట్టణంలో భారీ ఎత్తున స్వాగత ఏర్పాట్లు చేశారు. భారీ గజమాలలతో స్వాగతం పలికారు. క్రేన్లు ఏర్పాటు చేసి గజ మాలలు మెడలో వేశారు. హనుమాన్ ఫ్లెక్సీని క్రేన్‌కు కట్టి దారి పొడవునా ఊరేగించారు. కొండగట్టుకు అంజన్న ఆశీర్వాద నేపథ్యంలో కరీంనగర్ మొత్తం కాషాయ మయమైంది. కార్యక్రమంలో ప్రోగ్రాం కోఆర్డినేటర్స్ మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగిడి మనోహర్‌రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు శాంతికుమార్, రాష్ట్ర అధికార ప్రతినిధులు వై సునీల్‌కుమార్, సంగప్ప, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, సిరిసిల్ల అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి, నగర మేయర్ కొలగాని శ్రీనివాస్, పార్లమెంట్ కన్వీనర్ మండుటెండను లెక్కచేయక కేంద్రహోం శాఖ సమాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ చేపట్టిన అంజన్న ఆశీర్వాద యాత్ర శనివారం రాత్రి వరకు కొండగట్టుకు చేరుకుంది. ఉదయం కరీంనగర్‌లోని మహాశక్తి ఆలయం వద్ద ప్రారంభమైన మహా పాదయాత్ర 11 గంటల్లో 40 కిలోమీటర్ల మేర నాయకులు, కార్యకర్తలతో కలిసి అంజన్న మొక్కులు చెల్లించుకున్నారు. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో బిజీగా ఉన్న కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ ఢిల్లీ నుంచి బయలుదేరి రాత్రి 1.30కు కరీంనగర్ చేరుకున్నారు. ఉదయం ఏడు గంటలకు కరీంనగర్ మహాశక్తి అమ్మవారి ఆలయంలో పూజలు నిర్వహించి అంజన్న ఆశీర్వాద యాత్రను ప్రారంభించారు. నూతనంగా ఎన్నికైన బీజేపీ సర్పంచులు 108 మంది, 450 మంది వార్డు సభ్యులు, 54 కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, మేయర్ డిప్యూటీ మేయర్‌తో కలిసి వేలాది మది కాషాయ శ్రేణులు కాలి నడకన కొండగట్టుకు బయలుదేరారు. రాజకీయాలకతీతంగా చేపట్టిన అధ్యాత్మిక యాత్ర కావడంతో కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ షూస్ వేసుకోకుండా సాక్సులతోనే కొండగట్టుకు పాదయాత్ర చేపట్టారు. మండుటెండలో తారు రోడ్డుపై సాక్సులతోనే నడక సాగించారు. ఉదయం 9.30 గంటలకు ప్రారంభ కావాల్సిన పదో తరగతి విద్యార్థులకు ఇబ్బంది లేకుండా పాదయాత్ర చేపట్టారు. పదో తరగతి విద్యార్థులకు ఏలాంటి ఇబ్బందులు లేకుండా కరీంనగర్‌జగిత్యాల రహదారి ఒకవైపు పాదయాత్ర చేపట్టాలని నాయకులు, కార్యకర్తలకు సూచనలు అందిస్తు యాత్రను చేపట్టారు. పాదయాత్ర చేపట్టే సమయంలో ట్రాఫిక్‌కు ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులకు పూర్తిగా సహకరించాలని పదే పదే కోరారు. రామడుగు మండలం కోన్‌రావుపేట వద్దకు పాదయాత్ర చేరుకోగానే కార్యకర్తల కోలాహాలం, డిజే సౌండ్స్‌ల మధ్య కార్యకర్తలు డ్రోన్ ఎగురవేయడంతో ఓ చెట్టుపై ఉన్న తేనెతుట్టె కదిలి అందులో నుంచి తేనెటీగలు బయటకు రావడంతో కొంతసేపు గందరగోళం నెలకొంది. తేనెటీగల దాడిలో ముగ్గురు కార్పొరేటర్లు, మరో ముగ్గురు కాషాయ శ్రేణులు గాయపడ్డారు. వారిని వెంటనే ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. రామడుగు మండలం వెదిర వద్దకు చేరుకోగానే అప్పటికే అలసిపోయిన బండి సంజయ్ కొద్దిసేపు రోడ్డు పక్కనే ఉన్న బెంచిపై సేదదీరారు. అంబులెన్స్‌లోని వైద్యులు రోజువారీ పరీక్షలు నిర్వహించారు. అనంతరం తన పాదయాత్రను కొనసాగించారు. రామడుగు మండలం కోన్‌రావుపేట నుంచి బయలుదేరిన పాదయాత్ర 3.30కు గంగాధర చేరుకుంది. స్థానిక ఫంక్షన్ హాలులో కార్యకర్తలు, నాయకులకు భోజన ఏర్పాట్లు చేశారు. కాసేపు సేదతీరి సాయంత్రం 5.30 గంటలకు తిరిగి పాదయాత్రను వెంకటాయపల్లి, పూడూరు మీదుగా కొండగట్టుకు చేరుకున్నారు. అంజన్న ఆశీర్వాద యాత్రను దిగ్విజయంగా ముగించి బీజేపీ ప్రజా ప్రతినిధులతో కలిసి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు సమర్పించారు.

**పాదయాత్రకు పలువురి సంఘీభావం**

అంజన్న ఆశీర్వాద యాత్రకు భైంసా మున్సిపల్ యైర్మన్ తుమ్మల దత్తాత్రితో పాటు కౌన్సిలర్లంతా హాజరై పాదయాత్రకు సంఘీభావం ప్రకటించారు. పాదయాత్రలో ప్రోగ్రాం కోఆర్డినేటర్స్ మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగిడి మనోహర్‌రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు శాంతికుమార్, రాష్ట్ర అధికార ప్రతినిధులు వై సునీల్‌కుమార్, సంగప్ప, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి, నగర మేయర్ కొలగాని శ్రీనివాస్, పార్లమెంట్ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్‌రావు పాల్గొన్నారు

### అరణ్యమే వేదిక...
# గిరిజనమే అతిథులు

శనివారం పాడేరు పర్యటనకు విచ్చేసిన ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ , రాష్ట్ర ఆహార, పౌర సరఫరాల శాఖ మంత్రివర్యులు, జనసేన పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ పార్టీ ఆవిర్భవ దినోత్సవాన్ని పాడేరు నియోజకవర్గంలోని మారుమూల గిరిజన గ్రామం అయిన ఓనూరులో నిర్వహించారు. గిరిజనులు ఆప్యాయంగా నిర్మించుకున్న పార్టీ స్తూపాన్ని పవన్ కళ్యాణ్ ప్రారంభించి, పార్టీ జెండాను ఆవిష్కరించారు. గిరిజనులు ఆయనకు ఆప్యాయంగా తమ సంప్రదాయ థింసా నృత్యంతో ఆహ్వానం పలికారు. వేడుకలను వచ్చిన పార్టీ నాయకులు, కార్యకర్తలను పవన్ కళ్యాణ్ ఆప్యాయంగా పలకరించారు. పార్టీ కోసం పాటుపడిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

**నడుస్తూ.. పరిశీలిస్తూ... ప్రేమగా పలకరిస్తూ...**

అనంతరం ఆయన ఓనూరు కూడలి నుంచి నందిగరువు వరకు 2.4 కిలోమీటర్ల మేర అడవితల్లి బాట పథకంలో భాగంగా పీఎం జన్ మన్ ద్వారా నిర్మించిన బీటీ రోడ్డును ప్రారంభించారు. రోడ్డు నాణ్యతను స్వయంగా పరిశీలించారు. ఏజెన్సీ ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను, అడవితల్లి బాట పథకంలో నిర్మించిన రోడ్ల వివరాలను అధికారులు పవన్ కళ్యాణ్ కి వివరించారు. బీటీ రోడ్డుపై ఆయన నడుస్తూనే మార్గమధ్యంలోని గ్రామాల ప్రజలను ఆప్యాయంగా పలకరించారు. పవన్ కళ్యాణ్ ని చూసేందుకు వచ్చిన స్కూలు పిల్లలను దగ్గరికి తీసుకొని, వారితో ఫొటోలు దిగారు. స్కూలు బ్యాగులను అందించారు. ఓనూరు గ్రామంలో స్థానికులతో ముచ్చటించి వారి సమస్యలు తెలుసుకున్నారు. అక్కడే అంగన్వాడీ కేంద్రాన్ని, పాఠశాలను పరిశీలించి పిల్లలతో ముచ్చటించారు. విద్యార్థుల మధ్యలో కూర్చొని పాఠశాల సౌకర్యాల గురించి వాకబు చేశారు. పిల్లలు తయారు చేసిన సైన్సు ప్రాజెక్టులను, పరిశీలించి, బాగా చదువుకొని వృద్ధిలోకి రావాలని ఆకాంక్షించారు. స్కూలు పిల్లలకు కిట్లు పంపిణీ చేశారు. జల్ జీవన్ మిషన్ పథకంలో భాగంగా వేసిన పనులను స్వయంగా పరిశీలించి, పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. అక్కడ నుంచి నడుచుకుంటూ నందిగరువులో గిరిజనులతో మాటమంతి కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్లారు. ఈ కార్యక్రమంలో పాడేరు నియోజక వర్గం జనసేన ఇంచార్జ్, జానపద కళలు, సృజనాత్మక అకాడమీ ఛైర్మన్ వంపూరు గంగులయ్య, రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ కళ్యాణం శివశ్రీనివాసరావు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

### డొమెస్టిక్ సిలిండర్ల కోసం
## ఆందోళన అవసరం లేదు: మంత్రి ఉత్తమ్

ఎల్‌పీజీ డిస్ట్రిబ్యూటర్స్ అసోసియేషన్ ప్రతినిధులతో శనివారం మంత్రి ఉత్తమ్ సమావేశమయ్యారు. తాజా పరిస్థితులపై అసోసియేషన్ ప్రతినిధులు మంత్రితో చర్చించారు. అనంతరం ఉత్తమ్ మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా 810 మంది ఎల్‌పీజీ డిస్ట్రిబ్యూటర్లు, 1.3 కోట్ల మంది వినియోగదారులు ఉన్నారని చెప్పారు. “28 లక్షల మంది దీపం పథకం కింద ఎల్‌పీజీ వినియోగిస్తున్నారు. 7.5 లక్షల మంది కమర్షియల్ సిలిండర్లు వాడుతున్నారు. ప్రతినెలా డొమెస్టిక్ సిలిండర్లు 58 నుంచి 60 లక్షల సిలిండర్లు వాడుతున్నాం. కమర్షియల్ సిలిండర్ల పంపిణీ కొరత ఉంది. ఎల్‌పీజీ సిలిండర్లు గత కొద్ది రోజులుగా సాధారణం కంటే రెట్టింపు బుక్ అవుతున్నాయి. కమర్షియల్ సిలిండర్లు అవసరమైన సంఖ్యలో రోజుకు కేవలం 20శాతం మాత్రమే పంపిణీ చేయగలుగుతున్నాం. గృహ అవసరాలకు ఎవరూ ఇబ్బంది పడాల్సిన అవసరం లేదు. గతంలో రోజుకు 2.15 లక్షల డొమెస్టిక్ సిలిండర్లు పంపిణీ చేసేవాళ్లం. గత రెండు రోజులుగా 2.3 లక్షలు సప్లై చేస్తున్నాం. గతంలో కమర్షియల్ సిలిండర్లు రోజుకు 23వేలు డిస్ట్రిబ్యూట్ చేసేవాళ్లం, కానీ, ప్రస్తుతం రోజుకు 6 వేలు మాత్రమే సప్లై చేయగలుగుతున్నాం” అని ఉత్తమ్ వివరించారు.

# భాగ్యనగరం చుట్టూ రింగ్ రైలు



అన్ని విభాగాల నుండి అనుమతులు లభించిన అనంతరం ఈ మెగా ప్రాజెక్టు పట్టాలెక్కనుంది.తెలంగాణ సర్కార్ ఈ ప్రాజెక్టును అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. హైదరాబాద్ చుట్టూ రవాణా వ్యవస్థను బలోపేతం చేయడంతో పాటు.. శివారు ప్రాంతాల అభివృద్ధికి ఇది కీలకమని సీఎం రేవంత్ రెడ్డి భావిస్తున్నారు. అందుకే పలు సందర్భాల్లో ఆయన వ్యక్తిగతంగా కేంద్ర మంత్రులను కలిసి ఈ ప్రాజెక్టు ప్రాధాన్యతను వివరించారు. రైలు మార్గం.. రోడ్డు మార్గం పక్కపక్కనే ఉండటం వల్ల రవాణా ఖర్చులు తగ్గడమే కాకుండా భూసేకరణ సమస్యలు కూడా చాలా వరకు తగ్గే అవకాశం ఉంది. ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి పార్లమెంటులో ఈ అంశాన్ని నిరంతరం వెంబడించడంతో కేంద్రం నుండి స్పష్టమైన హామీ లభించింది. రీజినల్ రింగ్ రైలు అందుబాటులోకి వస్తే హైదరాబాద్ చుట్టూ ఉన్న జిల్లాల ప్రజలకు ప్రయాణ సౌకర్యం మెరుగుపడుతుంది. ఇది కేవలం ప్రయాణికులకే కాకుండా సరుకు రవాణాకు సైతం పెద్దపీట వేయనుంది. రింగ్ రోడ్డు.. రింగ్ రైలు సమన్వయంతో సాగితే ఆయా ప్రాంతాల్లో పారిశ్రామిక హబ్‌లు వెలిసే అవకాశం ఉంది. డీపీఆర్ సర్వేకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో ఈ ప్రాజెక్టుపై నెలకొన్న సందిగ్ధత తొలిగిపోయింది. రానున్న రోజుల్లో సర్వే పనులు వేగవంతం కానున్నాయి.

# తృణమూల్ ప్రభుత్వానికి కౌంట్‌డౌన్



ఈకబురు, కోల్‌కతా: పశ్చిమ బెంగాల్‌లో చొరబాటుదార్లను కాపాడేందుకే తృణమూల్ కాంగ్రెస్ ప్రభుత్వం ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్ఐఆర్)ను వ్యతిరేకిస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మండిపడ్డారు. చొరబాటుదార్ల కారణంగా రాష్ట్రంలో చాలాప్రాంతాల్లో జనాభా సమతూకంలో విపరీతమైన మార్పులు వచ్చాయని ఆందోళన వ్యక్తంచేశారు. అధికార తృణమూల్ కాంగ్రెస్ పార్టీ ఉద్దేశపూర్వకంగానే బెంగాలీ హిందువులను మైనార్టీలుగా మార్చేసిందని దుయ్యబట్టారు. ఎన్నికల్లో లబ్ధి కోసం చొరబాట్లను ప్రోత్సహించిందని ధ్వజమెత్తారు. ప్రధాని మోదీ శనివారం పశ్చిమ బెంగాల్‌లో పర్యటించారు.

రూ.18,680 కోట్ల విలువైన అభివృద్ధి ప్రాజెక్టులు ప్రారంభించారు. రెండు రైల్వే ప్రాజెక్టులను జాతికి అంకితం చేశారు. ఓడరేవుల ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు. అనంతరం కోల్‌కతాలో బహిరంగ సభకు హాజరయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా బీజేపీ నిర్వహించిన పరివర్తన్ యాత్ర ముగింపు సందర్భంగా ఈ సభ నిర్వహించారు. ప్రధాని మోదీ మాట్లాడుతూ.. మమతా బెనర్జీ ప్రభుత్వం రాజ్యాంగ బద్ధమైన సంస్థలపై దాడి చేసిందని ఆరోపించారు. ఈ అరాచక ప్రభుత్వానికి కౌంట్‌డౌన్ మొదలైందని అన్నారు.

రాజకీయ మార్పు తీసుకురావాలని ప్రజలకు సూచించారు బెంగాల్ ఆత్మను కాపాడేందుకు, కట్ మనీ సంస్కృతిని అంతం చేసేందుకు, భయం నుంచి విముక్తి కోసం ఈ ఎన్నికలు జరగబోతున్నాయని స్పష్టంచేశారు. రాష్ట్ర భవిష్యత్తు విషయంలో ఈ ఎన్నికలు నిర్ణయాత్మక పోరాటమని అభివర్ణించారు. బెంగాల్‌లో జంగిల్ రాజ్ అంతం కాక తప్పదన్నారు. ఎస్ఐఆర్‌తో ఓటర్ల జాబితా నుంచి చొరబాటుదార్ల పేర్లుతొలగిస్తే తప్పేమిటని ప్రశ్నించారు. మృతి చెందినవారి పేర్లు కూడా తొలగించకూడదా? అని నిలదీశారు.

**నేరగాళ్లు ఉండాల్సింది జైల్లోనే..**

తృణమూల్ కాంగ్రెస్ గూండాలు ఇన్నాళ్లూ ప్రజలను భయపెట్టారని, ఇక ఆ గూండాలే భయపడే రోజులు వచ్చాయని ప్రధాని మోదీ పేర్కొన్నారు. నేరగాళ్లు, చొరబాటుదార్లు, బుజ్జగింపు రాజకీయాలు చేసేవాళ్లు చట్టానికి భయపడాల్సిందేనని ఉద్ఘాటించారు. నేరగాళ్లు ఉండాల్సిన చోటు జైలు మాత్రమేనని వ్యాఖ్యానించారు. బెంగాల్‌లో తాము అధికారంలోకి రాగానే వారిని జైలుకు పంపిస్తామన్నారు. ప్రజలను భయభ్రాంతులకు గురిచేసేవారిపై, హింసకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. రాష్ట్రంలో చట్టబద్ధమైన పాలన వచ్చే రోజు దగ్గర్లోనే ఉందన్నారు. చట్టాన్ని ఉల్లంఘించినవారిని, అరాచకాలకు పాల్పడినవారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని తీవ్రంగా హెచ్చరించారు. పొరుగుదేశాల్లో మతపరమైన వివక్షను ఎదుర్కొంటున్న మనదేశానికి శరణార్థులుగా వచ్చిన హిందువులకు భారత పౌరసత్వం కల్పించడం తృణమూల్ కాంగ్రెస్‌కు ఇష్టం లేదని ఆక్షేపించారు. ఎందుకంటే హిందువులను ఆ పార్టీ ఓటు బ్యాంకుగా భావించడం లేదన్నారు. కేవలం నేరస్థుల అండతోనే మమతా బెనర్జీ సర్కారు మనుగడ సాగిస్తోందని విమర్శించారు.

ఎస్ఐఆర్ నిర్వహించినందుకు రాజ్యాంగబద్ధ సంస్థ అయిన ఎన్నికల సంఘంపై ఆరోపణలు చేయడం సిగ్గుచేటు అంటూ ప్రధానమంత్రి మండిపడ్డారు. దళిత మహిళా రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మును తృణమూల్ కాంగ్రెస్ అవమానించిందని ఆరోపించారు. కేవలం రాష్ట్రపతినే కాకుండా.. దేశంలోని గిరిజనులు, రాజ్యాంగాన్ని అవమానించినట్లు ధ్వజమెత్తారు. ఆ పార్టీ అన్ని హద్దులూ దాటేసిందన్నారు.

**తృణమూల్, బీజేపీ కార్యకర్తల ఘర్షణ**

కోల్‌కతాలో ప్రధాని మోదీ హాజరైన సభ కంటే అరగంట ముందు అధికార తృణమూల్ కాంగ్రెస్, విపక్ష బీజేపీ కార్యకర్తల మధ్య ఘర్షణ జరిగింది. పరస్పరం రాళ్లు రువ్వుకున్నారు. తమ పార్టీలకు అనుకూలంగా బిగ్గరగా నినాదాలు చేశారు. ఈ ఘటనలో బీజేపీ నాయకుడితోపాటు ఓ పోలీసు అధికారి గాయపడ్డారు. బహిరంగ సభకు వస్తుండగా తృణమూల్ కాంగ్రెస్ కార్యకర్తలు తమను రెచ్చగొట్టి దాడి చేశారని బీజేపీ నేతలు ఆరోపించారు.

**ప్రతిపక్షంగా కాంగ్రెస్ విఫలం**

సిల్చార్: మన దేశంపై ప్రపంచ సంక్షోభాలు, యుద్ధాల ప్రభావాన్ని కనిష్ట స్థాయికి తగ్గించడానికి కృషి చేస్తున్నామని ప్రధానమంత్రి మోదీ స్పష్టంచేశారు. పశ్చిమాసియా పరిణామాల పట్ల మన దేశంలో ప్రజలను భయాందోళనకు గురి చేయడానికి ప్రతిపక్షాలు ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు. బాధ్యతారాహిత్యంగా వ్యవహరించడం సరైంది కాదని సూచించారు. మోదీ వరుసగా రెండోరోజు శనివారం కూడా అస్సాంలో పర్యటించారు.

రూ.23,550 కోట్ల విలువైన ప్రాజెక్టులను ప్రారంభించారు. సిల్చార్‌లో బహిరంగ సభలో ప్రసంగించారు. బాధ్యతాయుతమైన ప్రతిపక్ష పాత్ర పోషించడంలో కాంగ్రెస్ విఫలమైందని విమర్శించారు. పశ్చిమాసియా యుద్ధాన్ని అడ్డంపెట్టుకొని ప్రజల్లో అలజడి సృష్టించడం ఏమిటని ప్రశ్నించారు. కాంగ్రెస్‌కు అభివృద్ధి గురించి ఏమీ తెలియదన్నారు. మోదీని దూషించడం, పుకార్లు వ్యాప్తి చేయడం, అబద్ధాలు చెప్పడం, తప్పుడు ప్రచారంతో ప్రజలను తప్పుదోవ పట్టించడం మాత్రమే తెలుసని ఎద్దేవా చేశారు.

### మూసీని మురికి కూపంగా
# మార్చింది కాంగ్రెస్ పార్టీనే: కేటీఆర్



‘రూ.లక్షన్నర కోట్లతో మూసీని అభివృద్ధి చేస్తామంటున్నారు... అందాల పోటీలకు, ఫుట్‌బాల్ ఆటలకు వందల కోట్లు ఖర్చు పెడుతూ, మింగ మెతుకు లేదు కానీ మీసాలకు సంపెంగ నూనె లెక్క రేవంత్ తీరు తయారైంది. గత ప్రభుత్వంలో కేసీఆర్ పీపీటీ ప్రజెంటేషన్ ద్వారా నదుల నీటి వినియోగం, ప్రాజెక్టుల నిర్మాణం గురించి వివరిస్తే, రేవంత్ రెడ్డి పీపీటీ ద్వారా ఎవరి ఇల్లు ఎట్లా కూలగొట్టాలి, ఎవరి భూములు ఎట్లా లాక్కోవాలి అనే విధ్వంసం గురించి పీపీటీ ఇచ్చాడు’అని విమర్శించారు.

**రూ.లక్షన్నర కోట్లు ఎందుకు?**

నిజాం కట్టించిన అద్భుతమైన జంట జలాశయాలను ఖరాబ్ చేసింది కాంగ్రెస్ పార్టీయేనని, దశాబ్దాలపాటు అధికారంలో ఉన్న కాంగ్రెస్, టీడీపీ ప్రభుత్వాల పాలన ఫలితంగానే మూసీ సర్వనాశనమైందని కేటీఆర్ ధ్వజమెత్తారు. మూసీని మురికి కుప్పగా మార్చిన పాపానికి రేవంత్‌రెడ్డి ముక్కు నేలకి రాసి, ప్రజలకు క్షమాపణ చెప్పి పాపాన్ని కడుక్కోవాలని హితవు పలికారు. వందల కిలోమీటర్ల నమామి గంగే పథకానికి కేవలం రూ.42 వేల కోట్లు వ్యయమైతే, 55 కి.మీ. మూసీకి రూ.లక్షన్నర కోట్లు ఎందుకు ఖర్చవుతుందో రేవంత్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ రాష్ట్రాన్ని, ఈ నగరాన్ని ప్రేమించే పార్టీగా, వ్యక్తులుగా మూసీ అభివృద్ధిని ఏమాత్రం అడ్డుకోబోమన్నారు. మూసీ పేరుతో రూ.వేల కోట్ల సొమ్మును దోచుకుంటామంటే మాత్రం కచ్చితంగా అడ్డుకుంటామని చెప్పారు. గాంధీ మునిమనుమడు తుషార్ గాంధీ ఆయన పేరుతో మూసీలో దోపిడీ చేయొద్దని విజ్ఞప్తి చేసినా రేవంత్‌రెడ్డి పట్టించుకోవడం లేదని కేటీఆర్ అన్నారు. ఎవరూ అడ్డుకోవద్దని మహాత్మా గాంధీ విగ్రహాన్ని పెట్టే కుట్ర చేస్తున్నాడని చెప్పారు. ఒక్క ఇల్లు కూలగొట్టకుండా బీఆర్ఎస్ ప్రభుత్వం 6 కి.మీ. మూసీని విజయవంతంగా అభివృద్ధి చేసిందని, అయినా కాంగ్రెస్ మాదిరి ప్రచారం చేసుకోలేకపోయామన్నారు.

**మా అంచనా వ్యయం 16 వేల కోట్లు**

గోదావరి నుంచి నీళ్లు తీసుకొచ్చి కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా మూసీలోకి మంచినీళ్లను వదలాలని గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేసిందని కేటీఆర్ తెలిపారు. దాని కోసం కేవలం రూ.1100 కోట్లతో కొండపోచమ్మ నుంచి నీళ్లు తెచ్చే అవకాశం ఉందన్నారు. కానీ ఇదే కార్యక్రమానికి రూ. 10 వేల కోట్లకు అంచనాలు పెంచిన రేవంత్ రెడ్డి కొత్త ప్లాన్ ద్వారా అవినీతి కోసం ప్రయత్నిస్తున్నాడని ఆరోపించారు. మూసీని సమగ్రంగా అభివృద్ధి చేయడానికి తమకు వచ్చిన అంచనా వ్యయం రూ. 16 వేల కోట్లు మాత్రమే కాగా, రేవంత్ రెడ్డి మాత్రం ఇవన్నీ పక్కన పెట్టి రూ.లక్షల కోట్లు ఖర్చు పెట్టడానికి ప్రయతిన్స్తున్నారన్నారు.

**బఫర్ జోన్‌తో భయపెట్టి..**

ప్రభుత్వం బఫర్ జోన్ పేరు చెప్పి ప్రజలను భయపెట్టి వారి ఇళ్లను కూలుస్తోందని కేటీఆర్ విమర్శించారు. ‘డబ్బులు ఉన్న వాళ్లకే బఫర్ జోన్లు ఉంటాయా? రేవంత్ రెడ్డి సొంత ఇల్లు రెడ్డికుంట బఫర్ జోన్‌లో ఉంది కదా., దాని గురించి ఎందుకు మాట్లాడరు? వాళ్ల సోదరుడి ఇల్లు హైదరాబాద్‌లో బఫర్ జోన్‌లో ఉంది. మంత్రుల ఫామ్‌హౌస్‌లు, ఇళ్లు బఫర్ జోన్‌లో ఉన్నా.. వాటిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు’అని పేర్కొన్నారు. 20 ఏళ్ల కింద కట్టుకున్న అపార్ట్‌మెంట్‌లు, ఇళ్లను కూలగొడతా అంటున్న రేవంత్ రెడ్డి, ఇప్పుడు మూసీ బఫర్ జోన్‌లో కడుతున్న రియల్ ఎస్టేట్ సంస్థల అపార్ట్‌మెంట్లను మాత్రం ముట్టుకోలేకపోతున్నారని దుయ్యబట్టారు.

**3,300 ఎకరాలపై కన్నేసి..**

రేవంత్ 3,300 ఎకరాల భూమిపై కన్నేసి మూసీ ప్రణాళికను తెరపైకి తెచ్చాడని కేటీఆర్ ఆరోపించారు. ఈ మొత్తం భూముల విలువ రూ.1,50,000 కోట్లని, ఇందుకోసమే రియల్ ఎస్టేట్ వ్యాపార ఆధారిత మూసీని రూపొందిస్తున్నారన్నారు. డిజైన్ చేసే కంపెనీకే రూ.160 కోట్లు ఇచ్చారంటే, ఎంత అవినీతి జరుగుతున్నదో అర్థం చేసుకోవచ్చని చెప్పారు. రేవంత్‌రెడ్డికి కాంగ్రెస్ ప్రభుత్వమే తీసుకొచ్చిన 2013 భూసేకరణ చట్టం ప్రకారం ఇవ్వాల్సిన పరిహారం ఎంత ఉందో కూడా అవగాహన లేదని కేటీఆర్ ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఎమ్మెల్యేలు వివేకానంద గౌడ్, లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, స్వామి గౌడ్, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

### చరిత్ర సృష్టించిన
## తెలంగాణ విద్యుత్ శాఖ

ఈ-కబురు, మార్చి 13, 2026న తెలంగాణ రాష్ట్రంలో విద్యుత్ వినియోగం చరిత్రలోనే అత్యధిక స్థాయికి చేరుకుంది. ఆ రోజున రాష్ట్రం 341.08 మిలియన్ యూనిట్ల విద్యుత్ సరఫరా చేసి, గత రికార్డు అయిన 335.19 మిలియన్ యూనిట్లు (18.03.2025) ను అధిగమించింది. అదే విధంగా, 18,228 మెగావాట్ల గరిష్ట విద్యుత్ డిమాండ్ ను కూడా విజయవంతంగా తీర్చింది. ఇది గతంలో నమోదైన 17,162 మెగావాట్ల గరిష్ట డిమాండ్ (20.03.2025) కంటే ఎక్కువ. ఉష్ణోగ్రతలు పెరగడం మరియు వ్యవసాయ అవసరాలు అధికమవడం వల్ల విద్యుత్ అవసరం మరియు గరిష్ట లోడ్ రెండూ పెరిగాయి. భవిష్యత్తు అవసరాలకు సిద్ధంగా రాష్ట్ర విద్యుత్ వ్యవస్థ| రాబోయే రోజుల్లో పెరుగుతున్న విద్యుత్ అవసరాలను సమర్థవంతంగా తీర్చేందుకు రాష్ట్ర విద్యుత్ సంస్థలు తమ వ్యవస్థలను మరింత బలోపేతం చేస్తూ కొనసాగుతాయి. రోజుకు 350కు పైగా మిలియన్ యూనిట్ల విద్యుత్ అవసరం మరియు సుమారు 19,000 మెగావాట్ల గరిష్ట లోడ్ ను నిర్వహించేందుకు తెలంగాణ సిద్ధంగా ఉంది. బలమైన విద్యుత్ గ్రిడ్ మరియు సమన్వయంతో కూడిన కార్యాచరణ ప్రణాళికతో ఈ అవసరాలను ఎదుర్కొనే సామర్థ్యం రాష్ట్రానికి ఉంది.ఈ అధిక డిమాండ్ సమయంలో నిరంతర విద్యుత్ సరఫరాను కొనసాగించినందుకు రాష్ట్రంలోని అన్ని విద్యుత్ సంస్థల సిబ్బందిని గౌరవనీయ ఉప ముఖ్యమంత్రి అభినందించారు..

## పుతిన్ ప్రతిపాదనను తిరస్కరించిన ట్రంప్

ఈ యుద్ధంలో ఇరాన్‌కు పరిమిత స్థాయిలో రష్యా సహాయం చేస్తుండవచ్చని అమెరికా అధ్యక్షుడు పేర్కొన్నవేళ ఈ విషయం బయటకు వచ్చింది. అయితే, ఇలా రష్యా నుంచి ఇటువంటి ప్రతిపాదన రావడం ఇదే మొదటిసారి కాదని.. ఇంతకుముందు ఇలాంటి ఆఫర్‌లు వచ్చినట్లు అమెరికా ప్రతినిధి ఒకరు తెలిపారు. యురేనియం సురక్షితంగా ఉండేలా చూసుకోవాలనేది అమెరికా వైఖరి అని అన్నారు. మరోవైపు, ఇటువంటి ప్రతిపాదనను ఇరాన్ అంగీకరించే సంకేతాలు లేవని తెలుస్తోంది. యుద్ధానికి ముందు అమెరికాతో జరిగిన చర్చల సమయంలోనూ ఇరాన్ ఇటువంటి అంశాలను అంగీకరించలేదని సమాచారం.

## కళాశాల బస్సును ఢీకొట్టిన గూడ్సు రైలు.. 23 మందికి తీవ్రగాయాలు

శనివారం సాయంత్రం వెళ్లియణై వద్ద కుళత్తూర్‌లోని మానవరహిత రైల్వే లెవెల్ క్రాసింగ్‌ను దాటేందుకు ప్రయత్నించింది. అదే సమయంలో వేగంగా వచ్చిన గూడ్సు రైలు ఆ బస్సును ఢీకొట్టింది. ఈ ఘటనలో బస్సు వెనుక భాగం ధ్వంసం కావడంతో 23 మంది విద్యార్థులు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వెంటనే సహాయక చర్యలు చేపట్టారు. అంబులెన్సుల ద్వారా క్షతగాత్రుల్లో 21 మందిని కరూర్ ప్రభుత్వ వైద్య కళాశాల ఆస్పత్రికి, ఇద్దరిని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రులను కరూర్ ఎంపీ జ్యోతిమణి, మాజీ మంత్రి సెంథిల్ బాలాజీ తదితరులు పరామర్శించారు. దిండుక్కల్ జిల్లా కరికాళిలోని రాళ్ల క్వారీ నుంచి పులియూర్‌లోని ప్రైవేటు సిమెంట్ కర్మాగారానికి కంకర లోడును గూడ్సు రైలు తీసుకెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. బస్సు డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా ఈ ప్రమాదం జరిగిందా? అనే కోణంలోనూ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## డైమండ్ హైట్స్ దేవాలయం పూజల్లో పాల్గొన్న
# రాగం హరిశంకర్ యాదవ్



హరి శంకర్ యాదవ్ ను సన్మానిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు



డైమండ్ హైట్ కాలనీ వాసులతో కలిసి హరిశంకర్ యాదవ్

**ఆధ్యాత్మికతతో నిత్య జీవితంలో మానసిక ప్రశాంతత లభిస్తుంది : హరిశంకర్ యాదవ్**

ఈకబురు, నల్లగండ్ల డివిజన్ పరిధిలోని డైమండ్ హైట్స్ కాలనీలో నిర్వహించిన ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో శనివారం నల్లగండ్ల డివిజన్ బీఆర్ఎస్ పార్టీ నాయకులు రాగం హరిశంకర్ యాదవ్ పాల్గొన్నారు. డైమండ్ హైట్స్ కాలనీలోని డిహెచ్ సీ హనుమాన్ భక్తి సమితి ఆధ్వర్యంలో శ్రీ లక్ష్మీ గణపతి, ఆద్య ఆంజనేయ స్వామి హోమంలో హరి శంకర్ యాదవ్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన అన్న ప్రసాద వితరణలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులు రామలింగేశ్వర్ రావు, సుందరాచారి, నాగార్జునలతో పాటు కాలనీ సభ్యులు రాగం హరి శంకర్ యాదవ్ కు స్వాగతం పలికి ఘనంగా సన్మానించారు. అనంతరం హరిశంకర్ యాదవ్ మాట్లాడుతూ దైవారాధన, ఆలయ సందర్శన, ధ్యానం వంటివి నిత్యజీవితంలో ఆందోళన, ఒత్తిడిని తగ్గించి ప్రశాంతతను ఇస్తాయన్నారు. ఆధ్యాత్మిక చింతన మనస్సును చెడు ఆలోచనల నుండి మళ్లించి, మంచి మార్గంలో నడిపిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, స్థానిక కాలనీవాసులు, నల్లగండ్ల డివిజన్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆపదలో ఉన్నవారికి ఆపన్న హస్తం అందజేస్తున్న
# ముఖ్యమంత్రి సహాయ నిధి : అనిల్ కుమార్ యాదవ్

ఈకబురు, శేరిలింగంపల్లి : తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి సహాయ నిధి పథకం ఆపదలో ఉన్న వారికి ఆపన్న హస్తం అందిస్తుందని శేరిలింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మారబోయిన అనిల్ కుమార్ యాదవ్ అన్నారు. నియోజకవర్గ పరిధిలోని మజీద్ బండకు చెందిన బాధితుడు అనారోగ్యంతో బాధపడుతుండగా, శనివారం మజీద్ బండ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో బాధితునికి ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును అనిల్ కుమార్ యాదవ్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా అనిల్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో పేద, మధ్యతరగతి ప్రజలకు వైద్య సాయం అందించడానికి సిఎం రిలీఫ్ ఫండ్ ఏర్పాటు చేయబడిందని తెలిపారు. ఈ నిధి ద్వారా గత రెండేళ్లలో 3,76,373 మంది లబ్ధిదారులకు 1,685.79 కోట్ల రూపాయల సహాయం అందించబడిందని అన్నారు. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు వైద్య ఖర్చుల సహాయం అందజేయడం జరుగుతుందన్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధి పథకం ఆరోగ్యశ్రీ పథకానికి అదనంగా పనిచేస్తుందని తెలిపారు. ఈ పథకాన్ని వినియోగించుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం తెల్ల రేషన్ కార్డును తప్పనిసరి చేసిందని తెలిపారు. అనారోగ్య సమస్యలతో బాధపడుతూ వైద్య ఖర్చులు భరించలేని పేదలు ఈ పథకం కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, బాధితుడి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



సీఎం సహాయ నిధి చెక్కు అందజేస్తున్న అనిల్ కుమార్ యాదవ్

## తమిళ రచయిత వైరముత్తుకు... జ్ఞానపీఠ్



తమిళ సినీ గీత రచయితగా సుప్రసిద్ధులైన వైరముత్తు 1953లో తమిళనాడులోని తేని జిల్లా మెట్టూర్‌లో జన్మించారు. వర్తమాన తమిళ సాహిత్య రంగానికి విశేష సేవలందించిన వ్యక్తిగా పేరుపొందారు. కళాశాల విద్యార్థిగా ఉన్నప్పుడు రాసిన 'వైకరై మేఘంగళ్' కవితా సంకలనం.. అప్పట్లోనే ఓ మహిళా కళాశాలలో పాఠ్యాంశంగా మారింది. రాష్ట్ర ప్రభుత్వ అధికార భాషా కమిషన్‌లో పనిచేస్తున్న సమయంలో... 1980లో నిళల్‌గల్ చిత్రం ద్వారా సినీ రంగంలోకి అడుగుపెట్టిన వైరముత్తు 7,500కి పైగా పాటలు రాశారు. ఉత్తమ సినీ గీత రచయితగా 7 సార్లు జాతీయ పురస్కారాలు, 6 సార్లు తమిళనాడు ప్రభుత్వ పురస్కారాలు పొందారు.

**సామాజిక స్పృహ... లోతైన అవగాహన**

వైరముత్తు 40 వరకూ పుస్తకాలు రాశారు. కళ్లికాట్టు ఇతిగాసం, కరువాచ్చి కావియం, తన్నీర్‌దేశం, మూద్రం ఉలగపోర్.. ఆయన రచనల్లో ప్రధానమైనవి. మానవ సంబంధాల్లోని సున్నితత్వం, సామాజిక స్పృహ, ప్రకృతి గురించి లోతైన అవగాహన.. వైరముత్తు రచనల్లో కనిపిస్తాయి. ఆయన ఎన్నో గౌరవాలు, పురస్కారాలు పొందారు. 2003లో పద్మశ్రీ, సాహిత్య అకాడమీ.. 2014లో పద్మభూషణ్ అవార్డులు వరించాయి. తమిళనాడు ప్రభుత్వం నుంచి కళైమామణి పురస్కారాన్ని పొందారు. 'భారతీయ భాషల్లో తమిళం ప్రధానమైనదిగా గుర్తింపు పొందినప్పటికీ ఇప్పటివరకూ ఆ రాష్ట్రానికి చెందిన పీవీ అకిలన్(1975), డి.జయకాంతన్(2002)లను మాత్రమే జ్ఞానపీఠ్ వరించింది. తాజాగా వైరముత్తును ఎంపిక చేశాం' అని జ్ఞానపీఠ్ సంస్థ ఒక ప్రకటనలో తెలిపింది. విజేతకు రూ.11 లక్షల నగదు, సరస్వతి కాంస్య విగ్రహం, ప్రశంసపత్రం అందిస్తారు. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలు జరగబోతున్న తరుణంలో వైరముత్తు ఎంపిక ప్రాధాన్యం సంతరించుకొంది.

# ఎడతెగని దాడులు



**టెహ్రాన్‌లో భారీ పేలుడు:**

ఇరాన్ రాజధాని టెహ్రాన్‌ను శుక్రవారం భారీ పేలుడు కుదిపేసింది. 'ఇంటర్నేషనల్ కుడ్స్ డే' సందర్భంగా పాలస్తీనియన్లకు మద్దతుగా, ఇజ్రాయెల్‌కు వ్యతిరేకంగా.. నగరంలోని ఫిర్దౌసీ స్క్వేర్ ప్రాంతంలో ప్రభుత్వ ఆధ్వర్యంలో చేపట్టిన వార్షిక ర్యాలీకి వేలమంది హాజరయ్యారు. వారిని లక్ష్యంగా చేసుకొని దాడి జరిగింది. ఈ ఘటనలో ఎవరైనా మరణించారా, గాయపడ్డారా అనే వివరాలు తెలియరాలేదు.

**దాడులు కొనసాగించిన ఇరాన్**

ఇజ్రాయెల్, గల్ఫ్ దేశాలపై క్షిపణి, డ్రోన్ దాడులను ఇరాన్ ముమ్మర స్థాయిలో కొనసాగించింది. గల్ఫ్‌లో ప్రధానంగా చమురు కేంద్రాలు, ఇతర మౌలిక వసతులను అది లక్ష్యంగా చేసుకుంటోంది. తమ దేశంపైకి పలు విడతల్లో దూసుకొచ్చిన దాదాపు 50 డ్రోన్లను కూల్చివేసినట్లు సౌదీ అరేబియా వెల్లడించింది.

ఇరాన్ శుక్రవారం తమపైకి 7 బాలిస్టిక్ క్షిపణులు, 27 డ్రోన్లను ప్రయోగించినట్లు యూఏఈ తెలిపింది. దుబాయ్‌లోని ఓ పారిశ్రామిక ప్రాంతంపైకి దూసుకొచ్చిన డ్రోన్లను విజయవంతంగా అడ్డుకున్నారు. తుర్కియేపైకి ఇరాన్ ప్రయోగించిన బాలిస్టిక్ క్షిపణిని తూర్పు మధ్యధరా ప్రాంతంలో మోహరించి ఉన్న నాటో రక్షణ వ్యవస్థలు అడ్డుకున్నాయి. ఇజ్రాయెల్, అమెరికా బలగాలపై 44వ విడత క్షిపణి దాడులు చేపట్టినట్లు ఇరాన్‌కు చెందిన ఐఆర్‌జీసీ ప్రకటించింది. ఒమన్‌లోని సోహర్ నగరంలో జరిగిన డ్రోన్ దాడిలో ఇద్దరు భారతీయులు మృత్యువాతపడ్డారు. ఈ ఘటనలో మరో 10 మంది భారతీయులు గాయపడ్డారు. ఇరాన్ యుద్ధం మొదలైన తర్వాత పశ్చిమాసియా నుంచి 1.50 లక్షల మంది భారతీయులు స్వదేశానికి వచ్చినట్లు విదేశీ వ్యవహారాల శాఖ సంయుక్త కార్యదర్శి అసీం మహాజన్ వెల్లడించారు.

ఇజ్రాయెల్, హెజ్‌బొల్లా మధ్య పోరు మరింత తీవ్రస్థాయికి చేరింది. హెజ్‌బొల్లా రాకెట్ దాడులతో ఉత్తర ఇజ్రాయెల్‌లో దాదాపు 60 మంది గాయపడ్డారు. ఇజ్రాయెల్ దాడుల్లో లెబనాన్ రాజధాని బీరుట్‌లో ఓ వ్యక్తి మరణించారు. ఐక్యరాజ్య సమితి సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెరస్ శుక్రవారం లెబనాన్‌లో పర్యటించారు. ఇజ్రాయెల్, హెజ్‌బొల్లా కాల్పుల విరమణ ఒప్పందం కుదుర్చుకోవాలని గుటెరస్ పిలుపునిచ్చారు. ఇరాన్‌పై యుద్ధంలో అమెరికా ఉపయోగిస్తున్న రీఫ్యూయెలింగ్ విమానం కేసీ 135 పశ్చిమ ఇరాక్‌లో కూలిపోయింది. ఈ ఘటనలో అందులోని ఆరుగురు సిబ్బంది మృత్యువాతపడ్డారు. ట్యాంకర్ విమానం కూలిపోవడానికి శత్రువుల దాడి కారణం కాదని అమెరికా సెంట్రల్ కమాండ్ స్పష్టం చేసింది.

**వాళ్లను చంపడం గొప్ప గౌరవం: ట్రంప్**

ఇరాన్ నాయకులు 47 ఏళ్లుగా ప్రపంచవ్యాప్తంగా అమాయకుల ప్రాణాలను పొట్టన పెట్టుకుంటున్నారని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నారు. ఇప్పుడు అమెరికా 47వ అధ్యక్షుడిగా వారిని తాను హతమారుస్తున్నానని వ్యాఖ్యానించారు. అలా చేయడాన్ని గొప్ప గౌరవంగా 'ట్రూత్ సోషల్'లో పేర్కొన్నారు. మరోవైపు 'ఫాక్స్ న్యూస్ రేడియో'తో ముఖాముఖిలో ట్రంప్ మాట్లాడుతూ.. ఇరాన్ వద్ద ఉన్న శుద్ధ యురేనియం నిల్వలను స్వాధీనం చేసుకునేందుకు తాము ప్రస్తుతానికైతే ప్రయత్నాలేమీ చేయడం లేదన్నారు. తప్పనిసరి పరిస్థితులు ఎదురైతే అందుకు వెనుకాడబోమని పేర్కొన్నారు. రవాణా మార్గాల్లో నౌకలకు అమెరికా నౌకాదళం ఎస్కార్ట్‌గా వెళ్తూ రక్షణ కల్పించాల్సిన పరిస్థితి వస్తే.. తప్పకుండా అలాగే చేస్తామని చెప్పారు. ఇరాన్ త్వరలోనే లొంగిపోతుందని ట్రంప్ జోస్యం చెప్పారు. బుధవారం జీ7 నేతల వర్చువల్ భేటీలో ఆయన ఈ మేరకు పేర్కొన్నట్లు ఓ వార్తాసంస్థ తెలిపింది.

**మొజ్తాబాకు నెతన్యాహు హెచ్చరిక!**

ఇరాన్ నూతన సుప్రీం లీడర్ మొజ్తాబా ఖమేనీకి ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు గట్టి హెచ్చరిక జారీ చేశారు. గతంలో మొజ్తాబా తండ్రి ఆయతుల్లా అలీ ఖమేనీని లక్ష్యంగా చేసుకున్నట్లే.. భవిష్యత్తులో ఆయనపైనా చర్యలకు ఉపక్రమించే అవకాశముందన్నారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తగ్గే సంకేతాలేవీ కనిపించకపోవడంతో అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధర 100 డాలర్లకు పైనే కొనసాగుతోంది. దక్షిణ ఇరాన్‌లోని మినాబ్‌లో ఈ నెలారంభంలో బాలికల ప్రాథమిక పాఠశాలపై జరిగిన వైమానిక దాడిలో మరణించిన విద్యార్థుల కుటుంబాలకు అత్యవసర మానవతా సాయం కింద చైనా 2 లక్షల డాలర్లు అందజేయనుంది.

## తెలంగాణను ఆయిల్ పామ్ హబ్‌గా
# తీర్చిదిద్దుతాం :మంత్రి తుమ్మల

ఈకబురు, తెలంగాణ బ్యూరో :
తెలంగాణను దేశంలోనే ఆయిల్ పామ్ హబ్‌గా తీర్చిదిద్దే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కీలక చర్యలు తీసుకుంటోందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముందుచూపు, ప్రోత్సాహంతో రాష్ట్రవ్యాప్తంగా ఆయిల్ పామ్ సాగును విస్తరించి రైతులకు స్థిరమైన ఆదాయం కల్పించే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. రైతుల ఆర్థికాభివృద్ధికి దీర్ఘకాలిక భరోసా ఇచ్చే పంటగా ఆయిల్ పామ్ నిలుస్తోందని, ఒకసారి నాటితే 25 నుండి 30 సంవత్సరాల పాటు నిరంతర ఆదాయం అందించే ఈ పంట తెలంగాణ రైతులకు బంగారు భవిష్యత్తును అందించగలదని మంత్రి పేర్కొన్నారు. శనివారం సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం నర్మేట్టలో తెలంగాణ ఆయిల్ ఫెడ్ ఆధ్వర్యంలో రూ.300 కోట్ల వ్యయంతో నిర్మించిన అత్యాధునిక ఆయిల్ పామ్ ప్రాసెసింగ్ ఫ్యాక్టరీని మంత్రి పొన్నం ప్రభాకర్, ఆయిల్ ఫెడ్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి మరియు అధికారులతో కలిసి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పరిశీలించారు. ఫ్యాక్టరీ ట్రయల్ రన్ విజయవంతం కావడంతో అధికారులను, సిబ్బందిని అభినందించిన మంత్రి, ఈ ఫ్యాక్టరీ తెలంగాణలో ఆయిల్ పామ్ సాగుకు కొత్త దశను తీసుకువస్తుందని పేర్కొన్నారు. అత్యాధునిక మలేషియా సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మించిన ఈ ఫ్యాక్టరీ దేశంలోనే అత్యాధునికమైన వాటిలో ఒకటిగా నిలుస్తుందని తెలిపారు. గంటకు 30 నుండి 120 టన్నుల వరకు ఆయిల్ పామ్ గెలలను ప్రాసెస్ చేసే సామర్థ్యంతో నిర్మించిన ఈ ఫ్యాక్టరీ రైతులకు ఎంతో ఉపయోగకరంగా మారుతుందని అన్నారు. మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ ఆయిల్ పామ్ పనులు ప్రారంభించి, కేవలం 18 నెలల రికార్డు సమయంలోనే పనులు పూర్తి చేయడం జరిగిందని మంత్రి తెలిపారు. త్వరలోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఈ ఫ్యాక్టరీ ప్రారంభోత్సవం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. నర్మేట్ట పామాయిల్ ఫ్యాక్టరీలో క్రూడ్ పామ్ ఆయిల్, పామ్ కర్నల్ ఆయిల్ తయారీతో పాటు 4 మెగావాట్ల సామర్థ్యంతో బయో పవర్ ప్లాంట్, జీరో లిక్విడ్ డిశ్చార్జ్ విధానంలో పనిచేసే నీటి శుద్ధి కేంద్రం వంటి అత్యాధునిక సదుపాయాలు ఏర్పాటు చేసినట్లు మంత్రి తెలిపారు. ఆయిల్ పామ్ గెలల నుంచి నూనె ఉత్పత్తి ప్రక్రియలో మిగిలే వ్యర్థాలను వినియోగించి విద్యుత్ ఉత్పత్తి చేసే విధానాన్ని కూడా ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఈ ఫ్యాక్టరీ ద్వారా ఆయిల్ పామ్ రైతుల ఆదాయం పెరగడంతో పాటు స్థానికంగా ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతాయని చెప్పారు. మంత్రి తుమ్మల మాట్లాడుతూ ప్రస్తుతం పంట మార్పిడి అవసరం ఏర్పడిందన్నారు. రైతులు వరి పంటపైనే ఎక్కువగా ఆధారపడుతున్నారని, ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు మరియు సన్నాలకు ఇచ్చే బోనస్ కారణంగా దేశంలోనే అత్యధికంగా వరి పండిస్తున్న రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందన్నారు. అయితే కేంద్ర ప్రభుత్వం ధాన్యం కొనుగోలు పరిమితులు విధిస్తున్న నేపథ్యంలో రైతులు వరి మాత్రమే కాకుండా ఉద్యానపంటలు, కూరగాయలు, పామాయిల్ వంటి వాణిజ్య పంటలను సాగు చేయాలని సూచించారు. రైతులకు అధిక ఆదాయం పొందే ప్రత్యామ్నాయ పంటగా పామాయిల్ పంట ఎంతో ఉపయోగకరమని ఆయన పేర్కొన్నారు. ఆయిల్ పామ్ తోటల్లో అంతర పంటలుగా కోకో, జాజికాయ, మెకడామియా వంటి పంటలను కూడా సాగు చేసుకోవచ్చని మంత్రి తెలిపారు. దీంతో రైతులకు అదనపు ఆదాయం పొందే అవకాశం ఉంటుందని చెప్పారు. మార్కెట్ పరంగా కూడా ఈ పంట రైతులకు సులభంగా ఉండే పంటగా నిలుస్తుందని, పండిన గెలలను ఫ్యాక్టరీకి విక్రయించిన తరువాత మూడో రోజుకే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అవుతాయని తెలిపారు. ధాన్యం అమ్మకాలలో కొన్ని సందర్భాల్లో చెల్లింపులు ఆలస్యం అయ్యే పరిస్థితులు ఉండొచ్చని, అయితే పామాయిల్ రైతులకు వేగంగా చెల్లింపులు జరుగుతాయని చెప్పారు. అదేవిధంగా ఆయిల్ పామ్ పంటకు కోతుల బెడద, అడవి పందుల బెడద, అలాగే వాతావరణ పరిస్థితుల వల్ల పంట నష్టపోయే సమస్యలు తక్కువగా ఉంటాయని మంత్రి పేర్కొన్నారు. పామాయిల్ సాగు చేయాలనుకునే రైతులకు రూ.50,921 వరకు సబ్సిడీ అందిస్తున్నామని మంత్రి తెలిపారు. మొక్కలను ఉచితంగా అందజేస్తున్నామని, డ్రిప్ పరికరాలను కూడా ప్రభుత్వం అందిస్తున్నట్లు చెప్పారు. తాను మంత్రి బాధ్యతలు చేపట్టిన సమయంలో పామాయిల్ ధర టన్నుకు రూ.12,000 మాత్రమే ఉండేదని, కేంద్ర ప్రభుత్వంతో చర్చలు జరిపి దిగుమతి సుంకాన్ని పెంచేలా చేయడంతో ప్రస్తుతం టన్నుకు రూ.21,546కు చేరిందన్నారు. దీనిని రూ.25,000కు పెంచాలని ప్రధానమంత్రిని కోరుతున్నామని తెలిపారు. నర్మేట్ట పామాయిల్ ఫ్యాక్టరీ నిర్మాణంతో ఆయిల్ పామ్ సాగుపై రైతుల్లో మరింత నమ్మకం పెరుగుతుందని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. తెలంగాణలో పామాయిల్ సాగు విస్తరణకు ఈ ఫ్యాక్టరీ కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. అదేవిధంగా ఇక్కడ ఏర్పాటు చేయనున్న ఆయిల్ రిఫైనరీ యూనిట్‌కు గౌరవ ముఖ్యమంత్రిగారు త్వరలో శంకుస్థాపన చేయనున్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో సుమారు 2.91 లక్షల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు కొనసాగుతుండగా రాష్ట్రవ్యాప్తంగా 14 కంపెనీలు ఆయిల్ పామ్ సాగు అభివృద్ధికి పనిచేస్తున్నాయని మంత్రి తెలిపారు. తెలంగాణ ఆయిల్ ఫెడ్ పరిధిలోనే దాదాపు 42758 మంది రైతులు 1.8 లక్షల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు చేస్తున్నారని పేర్కొన్నారు. సిద్దిపేట జిల్లాలోనే 14361 ఎకరాల్లో 4,469 మంది రైతులు ఆయిల్ పామ్ సాగు చేపట్టగా, జనగామ, యాదాద్రి భువనగిరి, గద్వాల్, నారాయణపేట, మహబూబాబాద్ జిల్లాల్లో కలిపి 49376 ఎకరాల్లో 13479 మంది రైతులు సాగు చేస్తున్నారని వివరించారు. భారతదేశంలో వంట నూనెలకు భారీ డిమాండ్ ఉన్న నేపథ్యంలో ప్రతి సంవత్సరం సుమారు 164 లక్షల టన్నుల వంట నూనెలు దిగుమతి అవుతున్నాయని మంత్రి తెలిపారు. అందులో దాదాపు 59 శాతం పామాయిల్ వాటానే అని పేర్కొన్నారు. గత ఏడాది మాత్రమే దేశం లక్షా 38 వేల కోట్ల రూపాయల విలువైన వంట నూనెలను దిగుమతి చేసుకోవాల్సి వచ్చిందని, ఇందులో పెద్ద భాగం పామాయిల్‌దేనని చెప్పారు. ఈ పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని దేశం స్వయం సమృద్ధి సాధించాలంటే ఆయిల్ పామ్ సాగును విస్తరించడం అత్యవసరమని మంత్రి పేర్కొన్నారు.

## వేసవిలోగా వసతిగృహాల
# మరమ్మతులు పూర్తవ్వాలి

సంక్షేమ వసతిగృహాల కోసం నిర్మిస్తున్న భవనాలను రానున్న విద్యా సంవత్సరంలో అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. శనివారం సచివాలయంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌తో కలిసి సంక్షేమశాఖల బడ్జెట్ ప్రతిపాదనలపై భట్టి సమీక్షించారు. అనంతరం వైద్యారోగ్య, దేవాదాయశాఖ అధికారులతోనూ సమావేశం నిర్వహించారు. వసతిగృహాల బిల్లులు పక్షానికోసారి ఆర్థిక శాఖకు వచ్చే విధంగా సీనియర్ అధికారిని నియమించి బాధ్యత అప్పగించాలని అధికారులకు సూచించారు. ఎట్టిపరిస్థితుల్లోనూ ఈ వేసవిలో మరమ్మతులన్నీ పూర్తి చేయాలని, నిర్లక్ష్యాన్ని సహించబోమని హెచ్చరించారు. ప్రపంచం మొత్తం ఆయుర్వేదం వైపు చూస్తున్నందున ఉపాధిహామీ పథకంలో భాగంగా ఔషధ మొక్కలు పెంచాలని వైద్య, ఆరోగ్య శాఖ సమావేశంలో భట్టి తెలిపారు. పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేస్తే స్థానిక ప్రజలు అడవిని కాపాడుకుంటారని అటవీశాఖ అధికారులకు వివరించారు. పర్యాటకంతో స్థానికులకు ఉపాధితో పాటు ఆదాయం సమకూరుతుందని తెలిపారు. తరతరాలుగా వారసత్వంగా వస్తున్న దేవాలయాల అభివృద్ధిపై దృష్టి సారించాలని దేవాదాయశాఖ సమీక్షలో అధికారులకు సూచించారు.

**13న విద్యుత్తు వినియోగంలో రికార్డు**

తెలంగాణ చరిత్రలో ఒకే రోజున (ఈ నెల 13న) అత్యధికంగా 341.08 మిలియన్ యూనిట్ల విద్యుత్తు వినియోగంతో సరికొత్త రికార్డు నమోదు అయినట్లు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. గతంలోని 335.19 మిలియన్ యూనిట్ల రికార్డును అధిగమించినట్లు ఆయన శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉష్ణోగ్రతలు పెరగడం, వ్యవసాయ బోర్లకు అధిక సరఫరా వల్ల డిమాండు, వినియోగం గరిష్ఠ స్థాయికి చేరినట్లు వివరించారు. రోజుకు 350కు పైగా మిలియన్ యూనిట్ల వినియోగానికి తగినట్లుగా సరఫరా, 19వేల మెగావాట్ల గరిష్ఠ డిమాండును తట్టుకునేలా బలమైన విద్యుత్ గ్రిడ్ సామర్థ్యం రాష్ట్రానికి ఉందని భట్టి తెలిపారు.

## పెళ్లికి నిరాకరించిందని ఓ యువతికి
## ఎయిడ్స్ రక్తాన్ని ఇంజెక్షన్ ద్వారా ఎక్కించిన యువకుడు

రాజు వెడ్స్ రాంబాయి సినిమా తరహాలో జరిగిన ఈ ఘటన సంచలనంగా మారింది. వివరాల్లోకి వెళ్తే.. పోచారం పరిధికి చెందిన మనోహర్ యువకుడు ఎయిడ్స్ బాధితుడు. మనోహర్‌తో అతని తల్లిదండ్రులకు కూడా ఎయిడ్స్ ఉంది. ఈ విషయాన్ని దాచి ఓ యువతితో వివాహానికి సిద్ధపడ్డాడు. అయితే ఎయిడ్స్ ఉందని తేలడంతో ఆ పెళ్లికి యువతి నిరాకరించింది. దీంతో సదరు యువతిపై మనోహర్ కక్ష పెంచుకున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 11వ తేదీన యువతి ఇంటికి మనోహర్ వెళ్లాడు. తనతో పెళ్లికి ఒప్పుకోవాలని ఒత్తిడి చేశాడు. కానీ అందుకు యువతి నిరాకరించింది. దీంతో ఆమెపై కక్షతో తన రక్తంతో కూడిన ఇంజెక్షన్‌ను ఆమెకు బలవంతంగా ఎక్కించాడు. ఈ ఘటనపై బాధితురాలు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు మనోహర్‌ను అదుపులోకి తీసుకున్నారు.

## కీలక రంగాల్లో భాగస్వామిగా తెలంగాణ..
# టాంజానియా బృందంతో మంత్రి



డిజిటల్ ఆర్థిక వ్యవస్థగా రూపాంతరం చెందేందుకు టాంజానియాకు అవసరమైన సాంకేతిక సహకారాన్ని అందించేందుకు తెలంగాణ సిద్ధంగా ఉందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో ఐటీ, టూరిజం, హెల్త్ కేర్, లైఫ్ సైన్సెస్, మహిళా సాధికారత, ఎమర్జింట్ టెక్నాలజీస్, డిజిటల్ గవర్నెన్స్, డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, స్టార్టప్, ఇన్నోవేషన్ ఎకో సిస్టం, కెపాసిటీ బిల్డింగ్, స్కిల్ డెవలెప్మెంట్ తదితర కీలక రంగాల్లో టాంజానియాతో వ్యూహాత్మక భాగస్వామ్యానికి కాంప్రహెన్సివ్ రోడ్డు మ్యాప్ సిద్ధం చేస్తామన్నారు. శనివారం డా.బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో టాంజానియా మినిస్టర్ ఆఫ్ కమ్యూనికేషన్, ఐటీ, ఇన్నోవేషన్ ముద్రిక్ రమదాని సోరాగా నేతృత్వంలోని అత్యున్నత స్థాయి బృందం మంత్రి శ్రీధర్ బాబుతో ప్రత్యేకంగా సమావేశమయ్యింది. 'తెలంగాణ టాంజానియా' మధ్య ద్వైపాక్షిక సహకారాన్ని పెంపొందించేందుకు తీసుకోవాల్సిన చర్యలు, అవకాశాలపై చర్చించారు.ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. అంతర్జాతీయ భాగస్వామ్యాల ద్వారా తెలంగాణను దేశంలోని ఇతర రాష్ట్రాలకు రోల్ మోడల్‌గా తీర్చి దిద్దాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమన్నారు.ప్రస్తుత పరిస్థితుల్లో డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ సామాజిక, ఆర్థిక సమ్మిళిత వృద్ధికి బలమైన పునాదిగా మారిందన్నారు. ఆ దిశగా తెలంగాణ వేసిన అడుగులు ప్రపంచ పటంలో మన రాష్ట్రానికి ప్రత్యేక బ్రాండ్ ఇమేజ్‌ను క్రియేట్ చేశాయన్నారు. ఇదే స్ఫూర్తితో డిజిటల్ ఆర్థిక వ్యవస్థగా మారేందుకు టాంజానియాకు అవసరమైన సాంకేతిక సహకారం, మెంటార్ షిప్, నైపుణ్య మార్పిడి అందిస్తామన్నారు. అక్కడ ఫార్మా డిస్ట్రిబ్యూషన్ హబ్ ను ఏర్పాటు చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామని, అందుకు గల సాధ్యాసాధ్యాలపై అధ్యయనం చేసి తదుపరి నిర్ణయం తీసుకుంటామన్నారు. 'మీ సేవ' ద్వారా డోర్ స్టెప్ సిటిజన్ సర్వీసెస్ డెలివరీ, 'వీ హబ్' మార్గ నిర్దేశంలో మహిళా పారిశ్రామికవేత్తలకు ప్రోత్సహం, స్టార్టప్ ఎకో సిస్టం బలోపేతం తదితర అంశాల్లో ఒక 'నాలెడ్జ్ పార్ట్నర్'గా వ్యవహరిస్తామన్నారు. యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ద్వారా స్కిల్లింగ్, రీ స్కిల్లింగ్, అప్ స్కిల్లింగ్ పై మార్గనిర్దేశం చేస్తామన్నారు. బ్లూ ఎకానమీ, టూరిజంలో టాంజానియా అవలంభిస్తోన్న బెస్ట్ ప్రాక్టీసెస్ పై అధ్యయనం చేసి... తెలంగాణలోనూ అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.'డిజిటల్ ఎకానమీగా మారాలన్న మా లక్ష్య సాధనలో తెలంగాణ లాంటి ప్రగతిశీల రాష్ట్రాల వ్యూహాత్మక భాగస్వామ్యం ఆవశ్యకం. ఐటీ, హెల్త్ కేర్, మెడికల్ టూరిజం, డిజిటల్ గవర్నెన్స్, స్టార్టప్, ఇన్నోవేషన్ ఎకో సిస్టం, లైఫ్ సైన్సెస్ తదితర రంగాల్లో సాధించిన ప్రగతి, చేపట్టిన సంస్కరణలు మాకు స్ఫూర్తిదాయకం. అందుకే..తెలంగాణతో కలిసి పని చేసేందుకు త్వరలోనే ఎంవోయూ కుదుర్చుకుంటాం' అని టాంజానియా మంత్రి ముద్రిక్ రమదాని సోరాగా పేర్కొన్నారు. ఈ సమావేశంలో టాంజానియా కమ్యూనికేషన్, ఐటీ, ఇన్నోవేషన్ మంత్రిత్వ శాఖ ముఖ్య కార్యదర్శి ఫాత్మా మబ్రూక్ ఖమిస్, జాంజిబార్ ఐసీటీ అథారిటీ సీఈవో శుకూరు అవాద్ సులేమాన్, ప్రెసిడెంట్స్ డెలివరీ బ్యూరో హెడ్ ఆఫ్ టెక్నాలజీ అండ్ ఇన్వెస్ట్ మెంట్స్ జాన్ మహుండి తదితరులు పాల్గొన్నారు.

## రూ. 60వేల పెట్టుబడి..
# రూ. 25కోట్ల ఆదాయం!



సాధారణంగా పెద్దలు తమ పిల్లలకు ఆస్తులు ఇవ్వాలని ఆలోచిస్తారు.ఇందులో భాగంగానే కొందరు వివిధ రంగాల్లో పెట్టుబడులు పెడుతుండటారు. ఈ రోజుల్లో పెట్టుబడి పెట్టుకోవడానికి లెక్కేలేనన్ని మార్గాలు ఉన్నప్పటికీ.. చాలామంది భూములను కొనుగోలు చేస్తుంటారు. దీనికి కారణం ఏమిటో ఈ కథనంలో తెలుసుకుందాం.స్వాప్నిల్ కొమ్మావర్ అనే ఎక్స్ (ట్విటర్) యూజర్ తన సోషల్ మీడియా అకౌంట్ ద్వారా.. ఒక విషయం వెల్లడించారు. 1990లో నా మామ ఏకంగా 15000 రూపాయల చొప్పున, నాలుగు ఎకరాలను రూ. 60వేలుతో కొన్నారు. క్రమంగా ఆ ప్రాంతం అభివృద్ధి చెందింది. ఇప్పుడు అది ఒక జిల్లా స్థాయికి చేరింది. రిటైల్ దిగ్గజం డీమార్ట్ రెండు ఎకరాలు భూమిని రూ. 25 కోట్లు చెల్లించి కొనుగోలు చేసింది. దీన్నిబట్టి చూస్తే.. భూమిపై పెట్టే పెట్టుబడి ఎంత లాభదాయకంగా ఉంటుందో తెలుస్తుందని పేర్కొన్నారుభూమిని అమ్మగా వచ్చిన డబ్బును నా మామ ఫిక్స్‌డ్ డిపాజిట్‌లో పెట్టారు. ఇప్పుడు ప్రతి నెలలో రూ. 14.5 లక్షల వడ్డీ ఆదాయం వస్తోంది. ఇంకా, ఆయన దగ్గర రెండు ఎకరాల భూమి కూడా ఉంది. ఈ ట్వీట్ ప్రస్తుతం సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది. రూ. 60,000 నుంచి రూ. 25 కోట్లకు ఎంత అద్భుతమైన ప్రయాణం! అని ఒకరు కామెంట్ చేయగా, అన్ని భూములకు ఒకే విలువ ఉంటుందని దీని అర్థం కాదు; ఇది ప్రాంతం మరియు అదృష్టంపై ఆధారపడి ఉంటుందని మరొకరు పేర్కొన్నారు.

## నేడు తెలుగు రాష్ట్రాల్లో పెట్రోల్, డీజిల్ ధరలు



అంతర్జాతీయ చమురు మార్కెట్లలో భారీ హెచ్చుతగ్గులు కనిపిస్తున్నాయి. దేశీయంగా పెట్రోల్, డీజిల్ ధరలను ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు ప్రస్తుతం స్వల్ప మార్పులతో కొనసాగిస్తున్నాయి. ఎప్పటి కప్పుడు ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు (OMCs) ఇంధన ధరలను సవరించి ప్రకటిస్తుంటాయి. ఈ ప్రక్రియలో ప్రపంచ క్రూడ్ ఆయిల్ ధరలు, రూపాయి-డాలర్ మార్పిడి విలువలను పరిగణలోకి తీసుకుని ఇంధన ధరలను నిర్ణయిస్తారు. అంతర్జాతీయంగా ధరల్లో మార్పులు ఉన్నా వినియోగదారుల పై ఒక్కసారిగా ధరల భారం పడకుండా ఉండేలా ఆయిల్ కంపెనీలు కొంతవరకు ఆ ప్రభావాన్ని తాము భరిస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వ వర్గాలు సూచిస్తున్నాయి.

హైదరాబాద్
లీటర్ పెట్రోల్ ధర: రూ. 107.50
లీటర్ డీజిల్ ధర: రూ. 95.70

వరంగల్
లీటర్ పెట్రోల్ ధర: రూ. 107.05
లీటర్ డీజిల్ ధర: రూ. 95.90

విశాఖపట్నం
లీటర్ పెట్రోల్ ధర: రూ. 108.49
లీటర్ డీజిల్ ధర: రూ. 96.26

విజయవాడ
లీటర్ పెట్రోల్ ధర: రూ. 109.79
లీటర్ డీజిల్ ధర: రూ. 97.59

# 2025-26లో భారత వృద్ధి 7.5%



దిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (202526) లో భారత వృద్ధి రేటు 7.5 శాతంగా నమోదు కావొచ్చని ఫిచ్ రేటింగ్స్ అంచనా వేసింది. వచ్చే ఆర్థిక సంవత్సరానికీ వృద్ధి అంచనాలను 6.7 శాతానికి పెంచింది. 2026లో అంతర్జాతీయంగా ముడిచమురు సగటు ధర బ్యారెల్‌కు 70 డాలర్లుగా ఉంటుందని పేర్కొంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 7.4%, 202627లో 6.4% వృద్ధిరేటును గత డిసెంబరులో ఫిచ్ అంచనా వేసింది. 202627 ప్రథమార్థంలో వృద్ధి నెమ్మదించొచ్చని గ్లోబల్ ఎకనామిక్ ఔట్‌లుక్ 2026లో అభిప్రాయపడింది. సెప్టెంబరు త్రైమాసికంలో వృద్ధిరేటు 8.4% కాగా, డిసెంబరు త్రైమాసికంలోలో 7.8 శాతానికి తగ్గింది. ఈ ఏడాది భారత వృద్ధికి దేశీయ డిమాండ్ దోహదపడుతుందని, వినియోగదారు వ్యయాలు, పెట్టుబడులు వరుసగా 8.6%, 6.9% పెరిగే అవకాశం ఉందని ఫిచ్ పేర్కొంది. ఇరాన్‌పై అమెరికా ఇజ్రాయెల్ దాడులు ప్రారంభమయ్యాక చమురు ధర బ్యారెల్‌కు 30 డాలర్లు పెరిగి 100 డాలర్లకు చేరింది. హర్మూజ్ జలసంధి మూసివేత కారణంగా, ఈనెలలో చమురు ధర 90100 డాలర్ల మధ్య ఉండొచ్చని, ద్వితీయార్థం నాటికి 60 డాలర్ల మధ్యకు పడిపోవచ్చని ఫిచ్ భావిస్తోంది. దీని వల్ల 2026 వార్షిక సగటు ధర 70 డాలర్లుగా ఉండొచ్చని అంచనా వేసింది. 2026లో ప్రపంచ జీడీపీ వృద్ధి 2.6 శాతంగా ఉంటుందని ఫిచ్ అంచనా వేసింది. చమురు బ్యారెల్ ధర 100 డాలర్ల వద్ద స్థిరంగా ఉంటే, ప్రపంచ సరఫరాపై తీవ్ర ప్రతికూల ప్రభావాన్ని చూపుతుందని ఫిచ్ ముఖ్య ఆర్థికవేత్త బ్రియాన్ కౌల్టన్ హెచ్చరించారు. జనవరి, ఫిబ్రవరిలో ఆర్థిక కార్యకలాపాలు స్వల్పంగా నెమ్మదించినప్పటికీ.. భారత ఆర్థిక వ్యవస్థ పటిష్ఠంగానే ఉందని, రుణాల వృద్ధి ఇంకా రెండంకెల స్థాయిలోనే ఉందని ఫిచ్ తెలిపింది. 2026 డిసెంబరుకు రిటెయిల్ ద్రవ్యోల్బణం 4.5 శాతానికి పెరిగే అవకాశం ఉంది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కీలక రెపో రేటును 5.25% వద్దే ఈ ఏడాది, వచ్చే ఏడాది కూడా కొనసాగించవచ్చని అంచనా వేసింది. జాతీయ ఖాతాల డేటాను సవరించడం (బేస్ ఈయర్‌ను 201112 నుంచి 202223కి మార్చడం) వల్ల జీడీపీ వృద్ధి ఇప్పుడు మరింత స్థిరంగా కనిపిస్తోందని ఫిచ్ పేర్కొంది.

## మెటా భారీ లేఆఫ్‌లు..
# 16వేల ఉద్యోగాలకు కోత..?

కృత్రిమ మేధ రాకతో టెక్ రంగంలోని ఉద్యోగులకు ఈ ఏడాదీ కష్టకాలమే కొనసాగుతోంది. ఏఐతో ఉద్యోగాలు పోతాయనే ఆందోళనలు రోజురోజుకూ తీవ్రమవుతున్నాయి. అందుకు తగ్గట్టుగానే దిగ్గజ కంపెనీల ప్రకటనలు కలవరపెడుతున్నాయి. తాజాగా ఫేస్‌బుక్ మాతృ సంస్థ మెటా భారీ ఎత్తున లేఆఫ్‌లకు (Meta layoffs) సిద్ధమైనట్లు తెలుస్తోంది. దాదాపు 16వేల మందిని ఉద్యోగాల నుంచి తొలగించనున్నట్లు సమాచారం. ఈ మేరకు విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. ఏఐ (Artificial Intelligence)లో పెట్టుబడులను పెంచుతోన్న నేపథ్యంలో ఉద్యోగుల సంఖ్యలో కోత పెట్టాలని మెటా (Meta) భావిస్తున్నట్లు సమాచారం. ఇందుకు సంబంధించిన ప్రణాళికలను కంపెనీ టాప్ ఎగ్జిక్యూటివ్స్.. సీనియర్ లీడర్లతో పంచుకున్నట్లు ఆ కథనాలు పేర్కొన్నాయి. సంస్థ సిబ్బందిలోని దాదాపు 20 శాతం మందిని తొలగించాలని మెటా యోచిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఈ కంపెనీలో 79వేల మంది పనిచేస్తున్నారు. అంటే.. దాదాపు 16వేల మందికి లేఆఫ్‌లు (Layoffs) ఇవ్వనున్నట్లు సమాచారం. ఇదే నిజమైతే, 20222023 తర్వాత కంపెనీ చేపట్టబోయే అతిపెద్ద తొలగింపులు ఇవే కానున్నాయి. 2022 చివర్లో 11 వేల మందికి లేఆఫ్‌లు ఇచ్చిన మెటా.. ఆ మరుసటి ఏడాదే 10వేల మందిని విధుల్లో నుంచి తీసేసిన సంగతి తెలిసిందే. అయితే, తాజా కథనాలపై మెటా నుంచి అధికారిక స్పందనేదీ రాలేదు. ఇక, మెటా ప్రస్తుతం ఏఐ రంగంలో విస్తృతంగా పెట్టుబడులు పెడుతోంది. ఇందులో భాగంగానే 2028 నాటికి డేటా సెంటర్ల ఏర్పాటు కోసం 600 బిలియన్ డాలర్లు వెచ్చించాలని ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు కంపెనీ ఇటీవల వెల్లడించింది.




# మస్క్ టీమ్‌లో చేరిన ఇండియన్: ఎవరీ దేవేంద్ర చాప్లోట్?

ప్రపంచ వ్యాప్తంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, రోబోటిక్స్ రంగాలలో భారతీయుల ప్రతిభ ఎంతో గుర్తింపు పొందుతోంది. ఇందులో భాగంగానే ఇప్పుడు.. ఇండియన్ రోబోటిక్స్ ఎక్స్‌పర్ట్ & ఏఐ పరిశోధకుడు అయిన దేవేంద్ర చాప్లోట్.. ఎలాన్ మస్క్ కంపెనీలో చేరారు. దీనికి సంబంధించిన ఒక ట్వీట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.దేవేంద్ర చాప్లోట్ తన సోషల్ మీడియా ఖాతాలో.. ఎలాన్ మస్క్‌తో ఉన్న ఫోటోను షేర్ చేస్తూ.. సూపర్ ఇంటెలిజెన్స్ నిర్మించడానికి మస్క్ టీమ్‌లో చేరుతున్నాను అని వెల్లడించారు. దీనికి స్పందిస్తూ.. xAIలోకి స్వాగతం అంటూ మస్క్ ట్వీట్ చేశారు.

**ఎవరీ దేవేంద్ర చాప్లోట్?**

IIT-బాంబే పూర్వ విద్యార్థి అయిన చాప్లోట్, AI & రోబోటిక్స్ రంగంలో పనిచేస్తున్నారు. ఈయన 2014లో IIT-బాంబే నుంచి కంప్యూటర్ సైన్స్ & ఇంజనీరింగ్‌లో B.Tech & అప్లైడ్ స్టాటిస్టిక్స్‌లో మైనర్ పట్టభద్రుడయ్యారు. ఆ తరువాత కార్నెగీ మెల్లన్ యూనివర్సిటీ మెషిన్ లెర్నింగ్ విభాగం నుంచి పీహెచ్‌డీ పూర్తి చేసాడు. అక్కడే బిల్డింగ్ ఇంటెలిజెంట్ అటానమస్ నావిగేషన్ ఏజెంట్లపై పనిచేశారు. చాప్లోట్ దక్షిణ కొరియాలోని శామ్‌సంగ్ ఎలక్ట్రానిక్స్‌లో దాదాపు ఒక సంవత్సరం పాటు పనిచేశాడు. తరువాత అతను ఫేస్‌బుక్ AI రీసెర్చ్‌లో చేరాడు. AI రీసెర్చ్ సైంటిస్ట్‌గా, అతను ఆ సంస్థలో కంప్యూటర్ విజన్ అండ్ రోబోటిక్స్‌లో పనిచేశాడు. 2020లో, రోబోటిక్స్ నిపుణుడు మిస్ట్రాల్ AIలో చేరారు.



## ఆదిత్య, యామీల పతనం కోసం ఇండస్ట్రీ వేచి చూస్తోంది: రామ్ గోపాల్ వర్మ



సంచలన దర్శకుడు రామ్ గోపాల్ వర్మ మరోసారి తనదైన శైలిలో చేసిన వ్యాఖ్యలు అటు బాలీవుడ్, ఇటు టాలీవుడ్‌లో వేడిని పుట్టిస్తున్నాయి. ప్రముఖ బాలీవుడ్ దర్శకుడు ఆదిత్య ధర్ ప్రతిభను ఆకాశానికెత్తుతూనే, చిత్ర పరిశ్రమలో ఆయన ఎదుర్కొంటున్న అసూయను వర్మ బయటపెట్టారు. ఆదిత్య ధర్, ఆయన భార్య, నటి యామీ గౌతమ్‌ల పతనం కోసం పరిశ్రమ మొత్తం వేచి చూస్తోందని వర్మ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో సంచలనంగా మారాయి. ఆదిత్య ధర్ తెరకెక్కించిన స్పై థ్రిల్లర్ 'ధురంధర్' చూసినప్పటి నుండి తాను ఆయనకు అభిమానిని అయిపోయానని వర్మ చెప్పుకొచ్చారు.

ఆదిత్య ధర్ సినిమా మేకింగ్‌లో సరికొత్త పద్ధతులను, కథ చెప్పే తీరులో కొత్త గ్రామర్‌ను ప్రవేశపెట్టారని వర్మ కొనియాడారు. ఆయన ప్రభావం ఎంతలా ఉందంటే, టాలీవుడ్‌లో రాబోయే పలు భారీ బడ్జెట్ యాక్షన్ సినిమాలు 'ధురంధర్' మేకింగ్ స్టైల్‌ను చూసి తమ షూటింగ్‌లను ఆపేసి మరీ రీషూటింగ్ చేసుకుంటున్నాయని వెల్లడించారు. దీనివల్ల నిర్మాతలపై బడ్జెట్ భారం పడుతోందని, అందుకే పరిశ్రమకు ఆయనపై కోపం, అసూయ పెరిగిపోయాయని వర్మ విశ్లేషించారు. ఆదిత్య, యామీలు ఎప్పుడు తప్పు చేస్తారా? అని అందరూ ఎదురుచూస్తున్నారని ఆయన షాకింగ్ కామెంట్స్ చేశారు. ఈ వ్యాఖ్యలపై నెటిజన్లు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తూ వర్మను విమర్శిస్తున్నారు. రణ్‌వీర్ సింగ్ హీరోగా వచ్చిన 'ధురంధర్' మొదటి భాగం ప్రపంచవ్యాప్తంగా రూ. 1300 కోట్లకు పైగా వసూళ్లు సాధించి రికార్డు సృష్టించగా, ఇప్పుడు దాని సీక్వెల్ 'ధురంధర్: ది రివెంజ్' విడుదలకు సిద్ధమైంది. నిజానికి ఈ సినిమా యష్ నటించిన 'టాక్సిక్'తో తలపడాల్సి ఉండగా, అది వాయిదా పడటంతో ఇప్పుడు పవన్ కల్యాణ్ మోస్ట్ అవేటెడ్ మూవీ 'ఉస్తాద్ భగత్ సింగ్'తో పోటీ పడబోతోంది. మార్చి 19న ఈ రెండు భారీ చిత్రాలు బాక్సాఫీస్ వద్ద ఢీకొట్టబోతుండటంతో సినీ వర్గాల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది.




## రేపే 'ఉస్తాద్ భగత్ సింగ్' ప్రీ రిలీజ్ ఈవెంట్... వేదిక ఇదే!

పవర్ స్టార్ పవన్ కల్యాణ్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'ఉస్తాద్ భగత్ సింగ్' సినిమా సందడి మొదలైంది. ఈ సినిమా ప్రీ-రిలీజ్ ఈవెంట్‌ను మార్చి 15న హైదరాబాద్‌లో ఘనంగా నిర్వహించనున్నట్లు చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. ఉగాది పండుగ కానుకగా మార్చి 19న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రానుంది.

ఈ గ్రాండ్ ఈవెంట్‌కు హైదరాబాద్‌లోని యూసఫ్‌గూడ పోలీస్ గ్రౌండ్స్ వేదిక కానుంది. మార్చి 15వ తేదీ సాయంత్రం 5 గంటలకు ఈ వేడుక ప్రారంభమవుతుంది. అంతకంటే ముందే, అభిమానులకు మరో ట్రీట్ ఇచ్చేందుకు చిత్ర యూనిట్ సిద్ధమైంది. ఈరోజు (మార్చి 14) సాయంత్రం 6:30 గంటలకు సినిమా ట్రైలర్‌ను విడుదల చేయనున్నారు. ఈ మేరకు మేకర్స్ సోషల్ మీడియాలో పోస్టర్‌ను విడుదల చేశారు.

'గబ్బర్ సింగ్' వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత పవన్ కళ్యాణ్, దర్శకుడు హరీశ్ శంకర్ కాంబినేషన్‌లో వస్తున్న సినిమా కావడంతో 'ఉస్తాద్ భగత్ సింగ్'పై భారీ అంచనాలు నెలకొన్నాయి. ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని నిర్మిస్తుండగా, పవన్ సరసన శ్రీలీల, రాశీ ఖన్నా హీరోయిన్లుగా నటిస్తున్నారు. దేవి శ్రీ ప్రసాద్, తమన్ ఇద్దరూ ఈ సినిమాకు సంగీతం అందించటం విశేషం. దేవి శ్రీ ప్రసాద్ పాటలకు స్వరకల్పన చేయగా, తమన్ ఈ సినిమాకు బ్యాక్ గ్రౌండ్ మ్యూజిక్ అందించాడు.

ఈ రోజు ట్రైలర్, మరుసటి రోజే ప్రీ-రిలీజ్ ఈవెంట్ ఉండటంతో సోషల్ మీడియాలో పవన్ అభిమానుల సందడి కనిపిస్తోంది. ఈవెంట్‌కు సంబంధించిన అన్ని ఏర్పాట్లను పూర్తి చేసినట్లు చిత్ర బృందం తెలిపింది.

## 'సూపర్ వెల్లి'... కొత్త జానర్ ట్రై చేస్తున్న ఆదా శర్మ

ది కేరళ స్టోరీ' చిత్రంతో దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్న నటి అదా శర్మ, ఇప్పుడు ఓ సూపర్ ఉమన్ గా ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఆమె ప్రధాన పాత్రలో నటిస్తున్న ఈ కొత్త చిత్రానికి 'సూపర్ వెల్లి' అనే ఆసక్తికరమైన టైటిల్‌ను ఖరారు చేశారు. ఈ సినిమాకు రాజేష్ బచ్చాని దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రంలో అదా శర్మ పాత్ర చాలా భిన్నంగా ఉండనుంది. ప్రపంచాన్ని కాపాడే సూపర్ హీరోలా కాకుండా, తన శక్తులతో ప్రపంచాన్ని నాశనం చేయాలనుకునే సోమరి, గందరగోళ స్వభావం ఉన్న పాత్రలో ఆమె కనిపించనున్నారు. ఇటీవలే విడుదలైన టీజర్‌లో కూడా, ప్రపంచాన్ని రక్షించడం కంటే నిద్రపోవడానికే ఇష్టపడే పాత్రగా ఆమెను చూపించారు. దర్శకుడు రాజేష్ బచ్చాని మాట్లాడుతూ.. "కమాండో సినిమాలో అదా చేసిన భావనా రెడ్డి పాత్ర నాకు గుర్తుంది. ఆమెలోని సహజమైన ప్రతిభ, చురుకుదనం, హాస్యం చూశాక మా 'సూపర్ వెల్లి' పాత్రకు ఆమే సరైన ఎంపిక అనిపించింది. మూడేళ్లుగా ఈ స్క్రిప్ట్‌పై పనిచేస్తున్నాను. ప్రేక్షకులకు కొత్త అనుభూతిని ఇస్తాం" అని తెలిపారు.



## కొత్తింట్లో చేరిన 'దంగల్' నటి



'దంగల్', 'మిసెస్' వంటి చిత్రాలతో గుర్తింపు తెచ్చుకున్న ప్రముఖ నటి సాన్యా మల్హోత్రా తన సొంతింటి కలను నెరవేర్చుకున్నారు. ముంబైలో కొనుగోలు చేసిన కొత్త ఇంట్లో ఆమె శనివారం గృహప్రవేశ పూజను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకకు సంబంధించిన ఫోటోలను తన అధికారిక ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో పంచుకున్నారు. ఈ పూజా కార్యక్రమాల్లో సాన్యా గులాబీ రంగు చీరలో, వెండి ఆభరణాలతో సంప్రదాయబద్ధంగా కనిపించారు. ఆమె తల్లిదండ్రులు, సన్నిహితులు ఈ వేడుకలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సాన్యా ఓ భావోద్వేగ సందేశాన్ని పంచుకున్నారు. "సంవత్సరాల కలలు, కృషి, ఎదుగుదల ఫలితమే ఈ ఇల్లు. ఓర్పు, నమ్మకం యొక్క ఫలం ఎంత అందంగా ఉంటుందో ఈ ఇంటి ప్రతీ గోడ నాకు గుర్తుచేస్తుంది. నా ఈ ప్రయాణంలో నా కుటుంబం, స్నేహితుల నమ్మకమే నాకు అతిపెద్ద బలం. ఇది కేవలం ఇల్లు కాదు, నా ప్రయాణంలో ఒక చిన్న భాగం" అని ఆమె పేర్కొన్నారు. ఇక సాన్యా సినిమాల విషయానికొస్తే, ప్రస్తుతం అనురాగ్ కశ్యప్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'బందర్' చిత్రంలో ఆమె కీలక పాత్ర పోషిస్తున్నారు. ఇందులో ఆమె తొలిసారిగా నటుడు బాబీ డియోల్‌తో స్క్రీన్ షేర్ చేసుకోనున్నారు. వాస్తవ సంఘటనల ఆధారంగా రూపొందిన ఈ సినిమా 2025 టొరంటో ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ప్రదర్శితమైంది. మే 22న ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశం ఉంది. దీంతో పాటు, రాజ్‌కుమార్ రావు సరసన 'టోస్టర్' అనే మరో కామెడీ చిత్రంలో కూడా ఆమె నటిస్తున్నారు.

## సరికొత్త ప్రయోగం.. ఈ మూవీ బడ్జెట్ రూ.33వేలు.. ఇద్దరే నటులు..!

నానాటికీ సినీ నిర్మాణవ్యయం విపరీతంగా పెరిగిపోతున్న ప్రస్తుత తరుణంలో రూ.33 వేలతో సినిమా తీయొచ్చా? అంటే 'ఏంటి జోక్ చేస్తున్నావా' అనేవాళ్లే ఎక్కువ. కానీ, తీయొచ్చు అని చెప్పడమే కాదు, తీసి చూపించారు రాహి అనిల్ బార్వే. ఈ పేరు ఎక్కడో విన్నట్లు ఉంది కదూ. అవును ఆయనే. 'తుంబాడ్' వంటి మిస్టరీ థ్రిల్లర్ తీసి అలరించిన దర్శకుడు. ఇప్పుడు 'మన్‌పిశాచ్' (Mann Pishach) పేరుతో కేవలం ఇద్దరు నటులతో ప్రయోగం చేశారు. తాజాగా ఇందుకు సంబంధించిన ట్రైలర్ విడుదలైంది. అది చూసి అందరూ ఆశ్చర్యపోతున్నారు. అంతేకాదు, ఈ మూవీ మేకింగ్ ఎలా జరిగిందో అనిల్ ఇన్‌స్టా వేదికగా పంచుకున్నారు.



**స్క్రిప్ట్ 60 పేజీలే..**

ఈ సినిమా కోసం భారీ సెట్స్ వేయలేదు. ప్రస్తుతం మానవ జీవనగతినే మార్చేస్తున్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాయం తీసుకున్నారు. దీనిని గురించి ఇన్‌స్టా వేదికగా చెబుతూ.. "మన్‌పిశాచ్' స్క్రిప్ట్ కేవలం 60 పేజీలు. మేకింగ్‌లో ఎక్కువగా చేతితో గీసిన స్టోరీ బోర్డులు, ఐఫోన్‌తో తీసిన వీడియోలు, ఫొటోషాప్, జనరేటివ్ ఏఐ, ఆఫ్టర్ ఎఫెక్ట్స్ వాడి సినిమాను పూర్తి చేశాం" అని అనిల్ తెలిపారు. ఇక ఇందులో కేవలం ఇద్దరే నటులు. యానియా భరద్వాజ్, దీపక్ దమ్లే ఇందులో నటించారు.


**ఇదీ కథ..**

పురావస్తు శాఖకు చెందిన ఆఫీసర్ సదాశివరావ్.. హడమ్ గావ్ అనే ఊరికి వెళ్తాడు. కొండలో నుంచి బయటపడిన పెద్ద గుమ్మటం రహస్యం తెలుసుకునేందుకు రంగంలోకి దిగుతాడు. ఊళ్లో నివశిస్తున్న సావిత్రి యువ వితంతువు ఇంట్లో ఆశ్రయం పొందుతాడు. చీకటి పడగానే విచిత్రమైన సంఘటనలు చోటుచేసుకునే హడమ్ గావ్‌లో అతనికి ఎదురైన దారుణమైన అనుభవాలే మన్ పిశాచ్ స్టోరీ. "ఈ సినిమా మొత్తం వ్యయం రూ.33 వేలు. ఈ ప్రయోగం చేయడం వెనక ప్రధాన ఉద్దేశం. నష్టాల్లో మునిగిపోయిన ఫిలింమేకర్ ఒంటరిగా సినిమా తీయగలడా? అంటే ఆ ప్రశ్నకు సమాధానమే ఈ మూవీ. సినిమా తీయడానికి కావాల్సిందల్లా ఊహాశక్తి, ప్రాథమికంగా కొన్ని వస్తువులు, ఓపిక, మొండి పట్టుదల, అభిరుచి. ఇది చూసిన తర్వాత ఓ కళాకారుడు శూన్యం నుంచి కూడా ఏదైనా సృష్టించగలడనిపిస్తుంది. ఇప్పటికే ఈ ప్రయోగం విజయవంతమైంది" అని అనిల్ తెలిపారు.

**నేరుగా యూట్యూబ్‌లో విడుదల..**

ఈ ప్రాజెక్ట్‌ను అనిల్ బార్వే కేవలం నాలుగు నెలల్లోనే పూర్తి చేశారు. ఈ ప్రక్రియలో ప్రస్తుతం అందుబాటులో ఉన్న అధునాతన ఏఐ టూల్స్ వాడారు. భారీ డైలాగ్స్, యాక్షన్ కన్నా విజువల్స్, నిశ్శబ్దానికి ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చినట్లు ప్రచార చిత్రం చూస్తే అర్థమవుతోంది. స్క్రిప్ట్ పూర్తయిన తర్వాత ప్రతి షాట్‌ను పేపర్‌పై రఫ్ స్కెచ్ వేశారు. దాన్ని ఏఐ విజువల్ టీమ్‌కు అందించి, దర్శకుడి ఆలోచనను వివరించారు. దీంతో సమయం, డబ్బూ రెండూ ఆదా అయ్యాయి. 'మన్‌పిశాచ్' మార్చి 18న యూట్యూబ్ వేదికగా నేరుగా విడుదల చేస్తున్నారు. దీని నిడివి 80 నిమిషాలు మాత్రమే.

## గోటీల ఫ్యాక్టరీతో రూ.3 కోట్ల ఆదాయం.. ఎట్టకేలకు స్పందించిన రాజశేఖర్



రాజశేఖర్‌గారు గోటీలు/గోలీల వ్యాపారంతో ఎంత సంపాదిస్తారో తెలిస్తే మతిపోతుంది. బంగ్లాదేశ్, పాక్, ఇండియాల్లో గోటీలను అమ్ముతూ రూ.3 కోట్ల నుంచి రూ.4 కోట్లు సంపాదిస్తున్నారు' ఇది గత కొంతకాలంగా సామాజిక మాధ్యమాల వేదికగా వైరల్ అయిన వీడియోలోని సారాంశం. ఇటీవల కాలంలో యూట్యూబ్ వేదికగా నటీనటులకు సంబంధించి ఎన్నో వార్తలు ట్రెండ్ అవుతున్నాయి. వాటిలో ఏది నిజం? ఏది అబద్ధం? అనే తెలియాలంటే స్వయంగా ఆ నటీనటులే వివరణ ఇవ్వాలి. గోటీల వ్యాపారం (rajasekhar gotila factory) వీడియోపై రాజశేఖర్ తాజాగా ఓ పాడ్‌కాస్ట్ ఇంటర్వ్యూలో స్పందించారు. అలాంటిదేమీ లేదని తెలిపారు. "ఇదేమిటమ్మా మాయ మాయ' ఒక పక్క.. గోటీల ఫ్యాక్టరీ మరో పక్క ఎప్పుడూ ట్రెండ్ నడుస్తూనే ఉంటుంది. ఇటీవల గోటీల ఫ్యాక్టరీ గురించి మాట్లాడుకుంటుంటే సంతోషంగానే ఉంది. నాకు అలాంటిదేమీ లేదు. కొందరు అది నిజమేనని అనుకున్నారు కూడా. నాకు బాగా తెలిసినవాళ్లే ఫోన్ చేసి 'నిజమా' అని అడిగారు. ఆ వీడియో చూడగానే 'నాకు ఫ్యాక్టరీ ఎక్కడ ఉంది? నేనెక్కడ రూ.3 కోట్లు సంపాదిస్తున్నాను అనుకున్నా" అంటూ నవ్వుతూ సమాధానం ఇచ్చారు. సినిమాల్లో పలువురు నటులు రాజశేఖర్‌ను ఇమిటేట్ చేస్తూ సన్నివేశాలు చేసిన సంగతి తెలిసిందే. దీనిపైనా ఆయన స్పందించారు. "నన్ను ఎవరైనా ఇమిటేట్ చేస్తే తొలినాళ్లలో 'ఇదేంటి? నేను నిజంగా ఇలా చేశానా?' అని అనుకునేవాడిని. ఆ తర్వాత వాళ్లు చేసేది సరదాగా అనిపించేది. దర్శకుడు అనిల్ రావిపూడి నన్ను, వెంకటేశ్‌గారిని బాగా ఇమిటేట్ చేస్తారు. 'రోజ్.. రోజ్.. రోజా పువ్వా' పాటలో నేను చేసిన డ్యాన్స్ నాకే గుర్తులేదు. కానీ, స్టేజ్‌పై నన్ను ఇమిటేట్ చేస్తే నవ్వుకుంటాను" అని అన్నారు. ప్రస్తుతం శర్వానంద్ కథానాయకుడిగా రూపొందుతున్న 'బైకర్'లో రాజశేఖర్ కీలకపాత్ర పోషిస్తున్నారు. అభిలాష్ రెడ్డి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం ఏప్రిల్ 3న (biker movie release date) ప్రేక్షకుల ముందుకురానుంది. మాళవికా నాయర్ హీరోయిన్. ఈ సినిమా కోసం శర్వా, తాను చాలా కష్టపడినట్లు రాజశేఖర్ తెలిపారు. అదంతా తెరపై కనిపిస్తుందన్నారు. తన పాత్రకు సాయికుమార్ డబ్బింగ్ చెప్పిన తర్వాత బాగుంటే తప్పకుండా ఫోన్ చేసి అభినందిస్తారని, ఒకవేళ నచ్చకపోతే డబ్బింగ్ చెప్పేసి వెళ్లిపోతారంటూ రాజశేఖర్ చెప్పుకొచ్చారు.

అందుకే 'ధురంధర్ 2'ను వదులుకున్నా:

## అనిల్ కపూర్



: ప్రపంచవ్యాప్తంగా సినీ ప్రియులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తోన్న చిత్రం 'ధురంధర్ 2' (Dhurandhar 2). రణ్‌వీర్ సింగ్ ప్రధానపాత్రలో ఆదిత్య ధర్ తెరకెక్కించిన ఈ చిత్రం మార్చి 19న (dhurandhar 2 release date) ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సినిమాలో తాను అతిథి పాత్ర వదులుకోవాల్సి వచ్చిందని బాలీవుడ్ సీనియర్ నటుడు అనిల్‌కపూర్ తాజాగా ఓ ఇంటర్వ్యూలో తెలిపారు. "ఆ సినిమాలో ఓ కీలక అతిథి పాత్ర కోసం ఆదిత్య నన్ను సంప్రదించారు. అందులో నటించాలని నేనూ (Anil Kapoor) కోరుకున్నా. కానీ, ఆ సమయంలో అప్పటికే మరో దర్శకుడికి డేట్స్ ఇచ్చేశాను. దీంతో 'ధురంధర్ 2'లో నటించలేకపోయాను. ఒకరికి ఇచ్చిన డేట్స్‌ను క్యాన్సిల్ చేసి.. మరో సినిమాను అంగీకరించడం సమంజసం కాదు. అందులో నటించే అవకాశం కోల్పోవడం నా దురదృష్టమే.. కానీ నా బాధ్యత ముందు ఇది చిన్న విషయం. నాకు వృత్తిపై ఉన్న నిబద్ధత, క్రమశిక్షణ వల్లే ఈరోజు ఈ స్థాయిలో ఉన్నాను. చిత్రపరిశ్రమలో ఉన్నత స్థాయికి ఎదగాలంటే కేవలం టాలెంట్ ఉంటే సరిపోదు. ఇచ్చిన మాట మీద నిలబడటం చాలా ముఖ్యం" అని అనిల్ కపూర్ చెప్పారు. భవిష్యత్తులో ఆదిత్య సినిమాలో నటించే అవకాశం రావాలని కోరుకున్నారు.

## వివాదంలో చెన్నై సూపర్ కింగ్స్.. ఆ ఒక్క తప్పిదం




SRH ఓనర్ కావ్య మారన్ గురించి సోషల్ మీడియాలో రకరకాల వార్తలు వస్తున్న నేపథ్యంలో మరో వివాదం తెరపైకి వచ్చింది. ఐపీఎల్ ప్రారంభాని కంటే ముందే CSK వివాదంలో చిక్కుకుంది. చెన్నై సూపర్ కింగ్స్ యాజమాన్యంపై సన్ టీవీ నెట్ వర్క్ ( Sun TV Network ) నష్ట పరిహారం కోరుతూ దావా వేసింది. ఈ మేరకు మద్రాస్ హైకోర్టులో కోటి రూపాయల నష్ట పరిహారం కోరుతూ వివాదానికి తెరలేపింది సన్ టీవీ నెట్వర్క్. సన్ పిక్చర్స్ నిర్మించిన జైలర్, జైలర్ 2, కూలీ సినిమాలలోని పాటలు, బ్యాక్ గ్రౌండ్ మ్యూజిక్ చెన్నై సూపర్ కింగ్స్ వాడుకోంది. ఐపీఎల్ త్వరలోనే ప్రారంభం కానున్న నేపథ్యంలో చెన్నై సూపర్ కింగ్స్ యాజమాన్యం ఈ పాటలు, బీజీఎమ్ వాడుతుంది.కోటి రూపాయలు చెల్లించాల్సిందే

అయితే తమ అనుమతి లేకుండా మ్యూజిక్, డైలాగ్స్, ఆడియో ట్రాక్స్ వాడుకున్నారని చెన్నై సూపర్ కింగ్స్ యాజమాన్యంపై సన్ టీవీ సీరియస్ అయింది. ఇది కాపీరైట్ చట్టాల ఉల్లంఘన కిందికి వస్తుందని పేర్కొంది. అందుకే తమకు నష్టపరిహారం చెల్లించాలని కోరుతూ కోర్టు మెట్లు ఎక్కింది సన్ టీవీ. అయితే దీనిపై చెన్నై సూపర్ కింగ్స్ కూడా క్లారిటీ ఇచ్చింది. గతంలో వాడుకున్నప్పటికీ, వాటిని తొలగించినట్లు క్లారిటీ ఇచ్చింది చెన్నై సూపర్ కింగ్స్. దీంతో మరోసారి ఇరువు వర్గాల వాదన విని నిర్ణయం తీసుకుంటామని మద్రాస్ కోర్టు క్లారిటీ ఇచ్చింది.

## రోహిత్ శర్మను ఇంపాక్ట్ ప్లేయర్ గా ఆడించొద్దు



ఐపీఎల్ 2026 మరో 14 రోజుల్లోనే ప్రారంభం కానుంది. ఇలాంటి నేపథ్యంలో రోహిత్ శర్మ గురించి షాకింగ్ న్యూస్ బయటకు వచ్చింది. వచ్చే సీజన్ లో రోహిత్ శర్మను పూర్తిగా ఇంపాక్ట్ ప్లేయర్ గా వాడుకునేందుకు ముంబై ఇండియన్స్ నిర్ణయం తీసుకున్నట్లు వార్తలు వస్తున్నాయి. అంటే పూర్తి స్థాయిలో మైదానంలో రోహిత్ శర్మ కనబడబోడన్నమాట. కేవలం బ్యాటింగ్ చేసి వెళ్లిపోతాడు. ఈ మేరకు సోషల్ మీడియాలో వార్తలు వైరల్ అవుతున్నాయి. అయితే దీనిపై భారత మాజీ క్రికెటర్ ఆకాశ్ చోప్రా స్పందించారు. రోహిత్ శర్మను ఇంపాక్ట్ ప్లేయర్ గా ఆడించకూడదని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు ఆకాశ్ చోప్రా. ఐపీఎల్ 2026 లో ఇంపాక్ట్ ప్లేయర్ గా కాకుండా రోహిత్ శర్మను పూర్తిస్థాయి ప్లేయర్ గా ఆడించాలని కోరారు.రోహిత్ శర్మ ప్రస్తుతం మంచి ఫామ్ లో ఉన్నాడని వెల్లడించారు. దానికి తోడు 20 ఏళ్ల కుర్రాడిలా ఫిట్ గా తయారయ్యాడని గుర్తు చేశారు ఆకాశ్ చోప్రా. ఈ తరుణంలో రోహిత్ శర్మ సేవలను జట్టు వినియోగించుకోవాలని కోరాడు. అనుభవం ఉన్న లీడర్ మైదానంలో ఉంటే, కెప్టెన్ హార్దిక్ పాండ్యాకు చాలా ఉపయోగకరంగా ఉంటుందని తన అభిప్రాయాన్ని వెలిబుచ్చాడు ఆకాశ్ చోప్రా. గత సీజన్ లో కూడా ఇంపాక్ట్ ప్లేయర్ గా బ్యాటింగ్ మాత్రమే చేశాడు రోహిత్ శర్మ. మరి రోహిత్ శర్మ విషయంలో ఈ సీజన్ సందర్భంగా ముంబై ఇండియన్స్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో చూడాలి.

## సమయం కేటాయించలేను.. DC మెంటార్‌గా వైదొలిగిన పీటర్సన్



పీఎల్ 2026 మొదలుకావడానికి ఇంకా రెండు వారాలు మాత్రమే ఉంది. ఇలాంటి సమయంలో ఇంగ్లాండ్ మాజీ కెప్టెన్ కెవిన్ పీటర్సన్ కీలక నిర్ణయం తీసుకున్నాడు. దిల్లీ క్యాపిటల్స్ మెంటార్ పదవి నుంచి వైదొలుగుతున్నట్లు సోషల్ మీడియా వేదికగా ప్రకటించాడు. దానికి కారణం ఏంటో కూడా వెల్లడించాడు. ఆ పోస్టును హిందీలో పెట్టడం గమనార్హం. అదే సమయంలో తనను ఐపీఎల్‌లో మరో పాత్రలో చూస్తారంటూ తెలిపాడు.నేను ఈ సీజన్‌లో దిల్లీ క్యాపిటల్స్ జట్టుకు మెంటార్‌గా ఉండటం లేదు. ఆ బాధ్యతలకు కావాల్సినంత సమయం కేటాయించలేకపోతున్నా. అయితే, ఈ సీజన్‌లో ఆటగాళ్లంతా అద్భుతంగా రాణించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నా. అయితే, మిమ్మల్ని (ఫ్యాన్స్) కామెంట్రీ బాక్స్‌లో నుంచి చూస్తా. ప్రపంచంలోనే అత్యుత్తమ లీగ్ ఐపీఎల్. కొత్త సీజన్ కోసం వేచి చూడలేకపోతున్నా'' అని పీటర్సన్ ఎక్స్ వేదికగా పోస్టు పెట్టాడు. గత సీజన్ సమయంలో సీనియర్ బ్యాటర్ కేఎల్ రాహుల్‌తో పీటర్సన్ జరిపిన సరదా సంభాషణలు సోషల్ మీడియాలో అందరి దృష్టిని ఆకర్షించిన సంగతి తెలిసిందే.

ఇదేనా కారణం?

ఇంగ్లాండ్ జట్టుకు కోచింగ్ బాధ్యతలు చేపట్టేందుకు సిద్ధమని ఇటీవల కెవిన్ పీటర్సన్ ఆసక్తి చూపించాడు. బ్రెండన్ మెక్‌కలమ్ నేతృత్వంలో ఇంగ్లాండ్ సత్ఫలితాలు సాధించలేకపోతోంది. దీంతో కోచ్ మార్పు ఉండే అవకాశాలను కొట్టివేయలేని పరిస్థితి. దీంతో మెంటార్ వంటి బాధ్యతలు ఉంటే అవరోధంగా మారే ప్రమాదం లేకపోలేదు. అందుకే, కెవిన్ దిల్లీ మెంటార్ పదవిని వదిలేశాడంటూ క్రికెట్ వర్గాల్లో చర్చ నడుస్తోంది.

# ధోనీ ఆ విషయం అప్పుడే చెప్పాడు!




ఐపీఎల్ 18వ సీజన్ ప్రారంభానికి మరో 15 రోజుల సమయం మిగిలి ఉంది.ఇప్పటికే లీగ్‌లోని ఆయా జట్ల ఫ్రాంచైజీలు తమ ఆటగాళ్లను మ్యాచ్‌లు ఆడేందుకు సన్నద్ధం చేస్తున్నాయి. అయితే సీఎస్కే కెప్టెన్‌గా రుతురాజ్‌గైక్వాడ్ పేరును ఆ జట్టు మేనేజ్‌మెంట్ చాలా రోజుల క్రితమే ప్రకటించింది.

దీంతో ధోనీకి ఈ సీజన్ చివరిదని భావిస్తున్న అభిమానులు కెప్టెన్‌గా ఒక్క మ్యాచ్‌కైనా నాయకత్వం వహిస్తే బాగుంటుందని కోరుకుంటున్నారు. కానీ ధోనీ కెప్టెన్సీ విషయమై వేరే వాళ్లకు నాయకత్వ బాధ్యతలు అప్పగించాలని మేనేజ్‌మెంట్‌కు ఇది వరకే స్పష్టం చేశాడు. దీంతో ధోనీని ఈసారి కేవలం ఆటగాడిగా మాత్రమే కొనసాగనున్నాడు.

అయితే ఈసారి ఐపీఎల్‌లో అన్ని మ్యాచ్‌లు ఆడతాడా లేదంటే కొన్నింటికే పరిమితమవుతాడా అన్నది చూడాలి. కాగా ధోనీ కెప్టెన్సీ విషయమై ఇది వరకే తనకు ఒక సందేశాన్ని పంపించాడని భారత మాజీ క్రికెటర్ ఇర్ఫాన్ పఠాన్ పేర్కొన్నాడు.'ఐపీఎల్ ప్రారంభమవు తుందంటే అందరి కళ్లు సీఎస్‌కే మీదకే మళ్లుతాయి. ఎందుకంటే భారత క్రికెట్‌లో అత్యంత విజయవంతమైన కెప్టెన్‌గా పేరున్న ధోనీ ఐపీఎల్‌లోనూ నాయకుడిగా అంతే సక్సెస్ రేట్‌ను కలిగి ఉన్నాడు.

ఈసారి కెప్టెన్సీకి ధోనీ దూరమైనప్పటికీ అతడి సలహాలు మాత్రం జట్టుకు ఉంటాయనడంలో సందేహం లేదు. కెప్టెన్‌గా కొనసాగడానికి బదులు ఆటగాడిగా ఉండేందుకు ఇష్టపడుతున్నట్లు ధోనీ ఇది వరకే నాతో పేర్కొన్నాడు.' అని పఠాన్ తెలిపాడు. ఇక ధోనీకి ఇదే చివరి సీజన్ అని భావిస్తున్న తరుణంలో అటు సీఎస్‌కే యాజమాన్యం కూడా మాజీ వికెట్‌కీపర్ విషయంలో భారీగానే ప్లాన్ చేస్తుంది. ఎలాగైనా టైటిల్ కొట్టి ధోనీకి ఘనమైన వీడ్కోలు ఇవ్వాలని సీఎస్కే భావిస్తోంది.

మార్చి 28 నుంచి ప్రారంభం కానున్న ఐపీఎల్ 2026లో భాగంగా తొలి విడతలో 20 మ్యాచ్‌లు జరగనున్నట్లు ఐపీఎల్ యాజమాన్యం పేర్కొంది. అందుకు సంబంధించిన పూర్తి షెడ్యూల్‌ను కూడా ఇప్పటికే విడుదల చేసింది. మార్చి 28న బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో జరగనున్న తొలి మ్యాచ్‌లో డిఫెండింగ్ చాంపియన్ రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ)తో సన్‌రైజర్స్ హైదరాబాద్ తలపడనుంది. దేశంలో ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో పూర్తి షెడ్యూల్‌ను తర్వాత విడుదల చేస్తామని బీసీసీఐ ఇప్పటికే స్పష్టం చేసింది.

## తెలుగమ్మాయికి బీసీసీఐ అవార్డు..

# ద్రవిడ్, మిథాలీ, బిన్నీలకు జీవిత సాఫల్య పురస్కారం




ప్రతి ఏటా వివిధ విభాగాల్లో ఇచ్చే నమన్ అవార్డులను బీసీసీఐ శనివారం ప్రకటించింది. ఢిల్లీలో ఆదివారం అవార్డుల ప్రదానోత్సవం జరగనుంది. భారత దిగ్గజ క్రికెటర్లు రాహుల్ ద్రవిడ్, రోజర్ బిన్నీ, మిథాలీ రాజ్‌లకు లైఫ్‌టైం అచీవ్‌మెంట్ అవార్డులను ప్రకటించింది. భారత క్రికెట్‌కు చేసిన సేవలకు గుర్తింపుగా వారిని సత్కరించనుంది. నేడు జరిగే కార్యక్రమంలో ద్రవిడ్, బిన్నీలకు బీసీసీఐ అత్యున్నత గౌరవమైన కల్నల్ సీ.కే నాయుడు జీవిత సాఫల్య పురస్కారం, మిథాలీకి బీసీసీఐ లైఫ్ టైం అచీవ్‌మెంట్ అవార్డు అందజేయనుంది. ఈ ముగ్గురు భారత క్రికెట్‌కు అత్యుత్తమ సేవలందించారు. బిన్నీ 1983 వరల్డ్ కప్ గెలిచిన భారత జట్టులో సభ్యుడు. ఆ టోర్నీలో అత్యధిక వికెట్లు తీసి భారత్ విజయంలో కీలక పాత్ర పోషించారు. అలాగే, అతని కోచింగ్‌లో 2000లో అండర్19 జట్టు వరల్డ్ కప్ గెలిచింది. ఆ తర్వాత 201216 వరకు జాతీయ సెలెక్టర్‌గా వ్యవహరించారు. 2022 నుంచి గతేడాది వరకు ఆయన బీసీసీఐ ప్రెసిడెంట్‌గా ఉన్న విషయం తెలిసిందే. మరోవైపు, రాహుల్ ద్రవిడ్ గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. 'ది వాల్'గా గుర్తింపు పొందిన అతను అంతర్జాతీయ క్రికెట్‌లో 24,000 రన్స్ చేశాడు. కెప్టెన్‌గా కూడా చేశాడు. అలాగే, నేషనల్ క్రికెట్ అకాడమీ(ఎన్‌సీఏ) హెడ్‌గా యువ క్రికెటర్లను తయారు చేశాడు. ప్రస్తుతం భారత జట్టు మూడు ఫార్మాట్లలో వేర్వేరు టీమ్‌లతో ఆడే సామర్థ్యం కలిగి ఉందంటే ఒక రకంగా ద్రవిడే కారణం. అలాగే, ద్రవిడ్ 202124 వరకు టీమిండియా హెడ్ కోచ్‌గా ఉండగా.. అతని హయాంలోనే భారత జట్టు 17 ఏళ్ల తర్వాత టీ20 వరల్డ్ కప్ కైవసం చేసుకున్న విషయం తెలిసిందే. ఇక, హైదరాబాద్‌కు చెందిన మిథాలీ రాజ్ భారత మహిళా క్రికెట్‌కు మార్గదర్శి. సుదీర్ఘ కాలం జాతీయ జట్టుకు ప్రాతినిధ్యం వహించిన ఆమె దాదాపు 18 ఏళ్లపాటు కెప్టెన్‌గా వ్యవహరించింది. సారథిగా మహిళల క్రికెట్‌లో భారత జట్టును ఉన్నత స్థానంలో నిలబెట్టింది. వన్డేల్లో 7,805 రన్స్ చేయగా అత్యధిక పరుగులు చేసిన రికార్డు ఆమె పేరిటే ఉంది. ఆమె కెప్టెన్సీలో భారత జట్టు రెండుసార్లు వరల్డ్ కప్ ఫైనల్స్‌కు వెళ్లింది.గిల్‌కు రెండోసారి..స్మృతికి ఐదోసారి 202425కు సంబంధించి పాలీ ఉమ్రిగర్ అవార్డు (ఇంటర్నేషనల్ బెస్ట్ క్రికెటర్ ఆఫ్ ది ఇయర్) భారత టెస్టు, వన్డే కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌ను వరించింది. 2024 25లో టెస్టు, వన్డే ఫార్మాట్లలో అతను అదరగొట్టాడు. 9 టెస్టుల్లో 983 రన్స్ చేశాడు. 11 వన్డే మ్యాచ్‌ల్లో 490 రన్స్ సాధించాడు. ఉత్తమ క్రికెటర్‌గా అవార్డు గెలవడం గిల్‌కు ఇది రెండోసారి. తొలిసారి 2024లో అవార్డు సాధించాడు. ఇక, మహిళల విభాగంలో స్మృతి మరోసారి తన ఆధిపత్యాన్ని చాటింది. ఉత్తమ అంతర్జాతీయ క్రికెటర్ ఆఫ్ ది ఇయర్ అవార్డు మళ్లీ సొంతం చేసుకుంది. ఆమె వరుసగా రెండోసారి, మొత్తంగా ఐదోసారి ఉత్తమ క్రికెటర్‌గా నిలవడం విశేషం. 201819, 202021, 202122, 2024 25కు సంబంధించి అవార్డు సొంతం చేసుకుంది. గతేడాది భారత మహిళల జట్టు తొలిసారిగా వన్డే వరల్డ్ కప్ గెలవడంలో ఆమెది కీలక పాత్ర. 434 రన్స్ చేసి టోర్నీలో అత్యధిక పరుగులు చేసింది. అలాగే, వన్డేల్లో ఐదు శతకాలు బాది ఓ ఏడాదిలో అత్యధిక సెంచరీలు చేసిన క్రీడాకారిణిగా రికార్డు నెలకొల్పింది. అలాగే, వన్డేల్లో అత్యధిక పరుగులు చేసిన అవార్డు కూడా స్మృతినే గెలిచింది. అత్యధిక వికెట్లు తీసిన అవార్డు దీప్తి శర్మకు దక్కింది.

### అరంగేట్రంలోనే సత్తాచాటిన శ్రీచరణి

ఆంధ్రప్రదేశ్‌కు చెందిన స్పిన్నర్ శ్రీచరణి గతేడాదే అంతర్జాతీయ క్రికెట్‌లోకి అడుగుపెట్టింది. వచ్చి రావడంతోనే అద్భుత ప్రదర్శన చేసిన ఆమె ఏకంగా వరల్డ్ కప్ జట్టులో చోటు సంపాదించింది. భారత జట్టు ప్రపంచకప్ గెలవడంలో శ్రీచరణి పాత్ర కూడా ఎంతో ఉంది. 9 మ్యాచ్‌ల్లో 14 వికెట్లు తీసి భళా అనిపించింది. ద్వైపాక్షిక సిరీస్‌ల్లోనూ మెరిసింది. దీంతో శ్రీచరణి బెస్ట్ డెబ్యూ క్రీడాకారిణిగా అవార్డు సొంతం చేసుకుంది. పురుషుల విభాగంలో పేసర్ హర్షిత్ రాణా ఈ అవార్డు గెలిచాడు. దేశవాళీలో ఆల్‌రౌండర్లకు ఇచ్చే లాలా అమర్నాథ్ అవార్డు ఆయుశ్ మాత్రే( పరిమిత ఓవర్లు), హర్ష్ దూబె(రంజీ ట్రోఫీ) గెలిచారు. పురుషుల, మహిళల విభాగాల్లో కలిపి ముంబై జట్టు నాలుగు టైటిల్స్ గెలవగా.. ముంబై క్రికెట్ అసోసియేషన్‌కు బీసీసీఐ అవార్డు దక్కింది.

## సెమీస్‌లో ఇటలీపై విక్టరీ..

# హాకీ వరల్డ్ కప్‌కు భారత్ అర్హత




ఈ ఏడాది జరగబోయే మహిళల హాకీ వరల్డ్ కప్‌కు భారత మహిళల హాకీ జట్టు అర్హత సాధించింది. హాకీ వరల్డ్ కప్ క్వాలిఫయర్స్‌లో ఫైనల్‌కు చేరుకోవడంతో ప్రపంచకప్ బెర్త్ కన్ఫార్మ్ అయ్యింది. శుక్రవారం హైదరాబాద్‌లో జరిగిన సెమీస్‌లో భారత్ 1-0 తేడాతో ఇటలీపై విజయం సాధించింది. మనీషా చాహౌన్ ఏకైక గోల్ చేసి భారత్ గెలుపులో కీలక పాత్ర పోషించింది. ఆరంభం నుంచి మ్యాచ్ ఆసక్తికరంగా సాగింది. ఇరు జట్లు అద్భుతమైన డిఫెన్స్ ప్రదర్శించాయి. ఈ క్రమంలోనే భారత్‌కు గోల్ చేయడానికి పలు అవకాశాలు వచ్చాయి. 18వ నిమిషంలో పెనాల్టీ కార్నర్ దక్కగా నవ్‌నీత్ కౌర్ ప్రయత్నాన్ని ఇటలీ గోల్ కీపర్ అడ్డుకుంది. 27వ నిమిషంలో మరో పెనాల్టీ కార్నర్ చాన్స్ వచ్చినప్పటికీ అది వృథానే అయ్యింది. మరో అవకాశాన్ని కూడా నవ్‌నీత్ విజయవంతంగా గోల్ చేయలేకపోయింది.మరోవైపు, భారత గోల్‌కీపర్ బిచు దేవి కూడా ఇటలీ ప్రయత్నాలను తిప్పికొట్టింది. ఇక, 40వ నిమిషంలో మనీషా గోల్ నిరీక్షణకు తెరదించింది. పెనాల్టీ కార్నర్‌ను గోల్‌గా మల్చడంతో భారత్ 1-0తో ఆధిక్యంలోకి వెళ్లింది. ఆ తర్వాత కూడా మరో రెండు పెనాల్టీ కార్నర్లు దక్కినా గోల్ చేయలేకపోయింది భారత్. అదే సమయంలో కట్టుదిట్టమైన డిఫెన్స్‌తో ప్రత్యర్థిని నిలువరించింది. మరో నిమిషంలో ఆట ముగుస్తుందనగా ఇటలీకి పెనాల్టీ కార్నర్ దక్కింది. దీంతో ఆ జట్టు స్కోరును సమం చేస్తుందోమోనని అంతా టెన్షన్ అలుముకుంది. కానీ, భారత్ ప్రత్యర్థి ఆశలు నీళ్లు చల్లింది. గోల్‌ను అడ్డుకోవడంతో 1-0తో విజయం లాంఛనం చేసుకుంది. శనివారం జరిగే ఫైనల్‌లో ఇంగ్లాండ్‌తో తలపడనుంది.